

దుర్గమ్మకు గాజుల అలంకరణ



ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారికి గాజుల అలంకరణ వేడుక ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఐదు లక్షల గాజులతో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. గాజుల అలంకరణలో ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

6లో

కార్తీక సందడి



భవానీ ద్వీపంలో సందడి చేస్తున్న యువత

కార్తీకమాసం తొలి ఆదివారాన్ని పురస్కరించుకుని భవానీ ద్వీపం పర్యాటకులతో కళకళలాడింది. వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ద్వీపానికి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. దీంతో సందర్శకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు.

8లో



లాంచీలో ప్రయాణం

ఇసుక మాఫియాకు డ్రోన్లతో చెక్

రీచ్‌ల వద్ద ఎగురుతున్న పోలీస్ డ్రోన్లు

- దూరంగా ఉంచిన ఇసుక నిల్వల గుర్తింపు
- ఇప్పటి వరకు 2,125 టన్నుల ఇసుక సీజ్
- రాత్రివేళ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిశీలన



చెట్ల మాటున ఇసుక నిల్వ

ఇసుక మాఫియాకు పోలీస్ అధికారులు డ్రోన్లతో చెక్ పెట్టారు. రీచ్‌లకు దూరంగా తుప్పల మాటున నిల్వ చేసిన ఇసుకను డ్రోన్లతో కనిపెట్టి సీజ్ చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో 2,125 టన్నుల ఇసుక పట్టుకున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిరంతర పర్యవేక్షణ ద్వారా ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిరోధిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లాలో కృష్ణానదిలోని రీచ్‌ల నుంచి ఇసుకను అక్రమంగా తవ్వేసి డంపింగ్ చేసి తెలంగాణకు తరలించడం ద్వారా కాసులు వెనుకేసుకుంటున్న నేతలు పోలీస్ నిఘాకు చిక్కకుండా ఎత్తులు వేస్తున్నారు. జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉండడంతో పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు నిరంతర నిఘాకు ప్రణాళికలు రూపొందించారు. స్థానిక పోలీసులపై వివిధ రకాల ఒత్తిళ్లు ఉండే అవకాశం ఉండడంతో విజయవాడ నుంచి ప్రత్యేక బృందాలు రీచ్‌లు ఉన్న ప్రాంతాల్లో దింపుతున్నారు. రూరల్ డీసీపీ మహేశ్వరరాజు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, స్థానిక పోలీసులు రీచ్‌ల పరిసర ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. మారుమూల ప్రదేశాల్లో ఉన్న ఇసుకను గుర్తించడానికి డ్రోన్లను ఎగుర వేస్తున్నారు. ప్రత్యేక బృందాల మిగతా 8లో..

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

ఎన్‌డీబీ రోడ్ల విస్తరణలో కదలిక!

పది రోజుల్లో పనులు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశం

- క్షేత్రస్థాయిలో రోడ్ల సర్వే ప్రారంభం.. వారం రోజుల్లో పనులు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎన్‌డీబీ రోడ్ల పనులను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- ప్యాచ్ వర్క్‌లతో పాటు విస్తరించాల్సిన రోడ్లపైనా కూటమి ప్రభుత్వం దృష్టి
- రూ.240 కోట్లతో 13 ఆర్‌అండ్‌బీ రోడ్లను డబుల్ లేన్లుగా విస్తరణ!



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) నిధులతో చేపట్టే ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ పనులకు నాలుగేళ్ల తర్వాత అడుగు ముందుకు పడింది. సర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ పనులను కూటమి ప్రభుత్వం కొనసాగించి పూర్తి చేయాలని నిర్ణయించింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో గతంలో ప్రతిపాదించిన 13 ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ పనులను సమీక్షించటంతో పాటు వాటిని అతి త్వరలో చేపట్టేందుకు వీలుగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్ల విస్తరణ పనులపై దృష్టి సారించారు. వారంలో సర్వే పనులను పూర్తి చేయించి వెంటనే కాంట్రాక్టర్లతో పనులు చేయించటానికి రంగం సిద్ధం చేస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి, విజయవాడ)

వైసీపీ పాలనలో వివాదాస్పద నిర్ణయాలతో తీవ్ర జాప్యం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో గత వైసీపీ ప్రభుత్వంలో రూ.234 కోట్ల వ్యయంతో 13 ఆర్‌అండ్‌బీ రోడ్లను డబుల్ లేన్లుగా విస్తరించేందుకు నిర్ణయించారు. ఎన్‌డీబీ ఆర్థిక సహకారంతో ఈ విస్తరణ పనులు చేపట్టాలని తీర్మానించారు. ఈ పనులు చేపట్టిన మొదటి నుంచి వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలు వివాదాస్పదంగా ఉండటంతో ఏడాదిలో పూర్తి కావాల్సిన రోడ్లు నాలుగేళ్ల అయినా పూర్తి కాలేదు. ఎన్‌డీబీ రోడ్ల పనులను పరుగులు పెట్టించటానికి చిన్న కాంట్రాక్టర్లు సరిపోరన్న సరికొత్త వాదనలను తెరమీదకు తీసుకు వస్తూ నేషనల్ హైవే పనులను చేసిన బడా కాంట్రాక్టర్లు అయితేనే వేగంగా చేయించటం సాధ్యమవుతుందని ఆ మేరకు టెండరు మార్గదర్శకాలను రూపొందించారు. ఈ నిర్ణయంపై చిన్న కాంట్రాక్టర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న కాంట్రాక్టర్ల ఆవేదనను ప్రభుత్వం లక్ష్య పెట్టలేదు. పెద్ద కాంట్రాక్టర్ల చేత పనులు చేయిస్తేనే వేగంగా జరుగుతాయన్న వాదనలను పదేపదే తీసుకు వచ్చి చివరికి వారనుకున్నట్టుగానే చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన 13 ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ పనులను పెద్ద కాంట్రాక్టర్ల ముసుగులో 'వృద్ధి కన్‌స్ట్రక్షన్స్' కు కట్టబెట్టేశారు. వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ పనులు దక్కించుకున్న తర్వాత ఒక్కో రోడ్డును సబ్‌లీజుకు ఇచ్చేసింది. ఇంతోటి దానికి కిందటి వైసీపీ ప్రభుత్వం పెద్ద కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టడం ఎందుకన్న తీవ్ర విమర్శలు వచ్చాయి. సబ్ లీజుకు పొందిన చాలా మంది చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లు ఈ పనులు చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవటంతో చాలా మంది కాంట్రాక్టర్లు పనులు చేపట్టలేదు. ఎర్త్ వర్క్ చేసి వదిలేశారు.

విస్తరించనున్న ఆర్‌అండ్‌బీ రోడ్లు ఇవే

ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 ఆర్‌అండ్‌బీ సింగిల్ వరస రోడ్లను డబుల్ లేన్లుగా విస్తరించటానికి 2020, సెప్టెంబరులో టెండర్లు పిలిచారు. మచిలీపట్నం - నూజివీడు - కల్లూరు, చెవిటికల్లు - వత్సవాయి, నూజివీడు - ఏలూరు రోడ్డు, గన్నవరం - పుట్టగుంట రోడ్డు, మధిర - కంచికచర్ల రోడ్డు, నూజివీడు - గన్నవరం రోడ్డు, కందులపాడు - గంగినేని- ఎర్రుపాలెం రోడ్డు, నందిగామ - పొక్కునూరు రోడ్డు, కొత్తవరం - నిడుమోలు - ఐలూరు రోడ్డు, తేలప్రోలు - వుయ్యూరు - వల్లూరు రోడ్డు, నడుపూరు - వాడపల్లి - కోరుకల్లు రోడ్డు, మంటాడ - లంకపల్లి రోడ్డు, మచిలీపట్నం - కమ్మవారి చెరువు వయా చిన్నాపురం రోడ్లను డబుల్ లేన్లుగా విస్తరించాలని నిర్ణయించారు. వీటిలో చూస్తే కందులపాడు - గంగినేని - ఎర్రుపాలెం, నందిగామ - పొక్కునూరు, నూజివీడు - ఏలూరు రోడ్డు, గన్నవరం - నూజివీడు రోడ్లను అసలు మొదలు పెట్టనే లేదు. గన్నవరం - పుట్టగుంట రోడ్డు పనులు మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన రోడ్ల పనులు చేపట్టినా.. ఎర్త్ వర్క్ చేసి ఆపేశారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రావన్న ఉద్దేశంతో సబ్ లీజు పొందిన వారంతా పనులు ఆపేశారు. దీంతో వృద్ధి కన్‌స్ట్రక్షన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థ కూడా పనులు చేపట్టలేకపోయింది.

ఎన్‌డీబీ రోడ్లకు నాలుగేళ్ల తర్వాత కదలిక

నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) ద్వారా విస్తరించాల్సిన ఆర్‌అండ్‌బీ రోడ్లను కూటమి ప్రభుత్వం పునఃప్రారంభించింది. గతంలో టెండరు దక్కించుకున్న వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ సంస్థను మెడ వంచి పనులు చేయించేలా ఆర్‌అండ్‌బీ అధికారులు తీవ్ర ఒత్తిళ్ల తీసుకువస్తున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో ఆ సంస్థ ద్వారా సర్వే పనులు జరుగుతున్నాయి. వారం రోజుల్లో పనులు చేసేలా కాంట్రాక్టు సంస్థ చర్యలు చేపట్టింది. సబ్ లీజుదారులతో కూడా సమావేశమవుతున్నట్టుగా తెలుస్తోంది. మొత్తం మీద పది రోజుల్లో పనులు ప్రారంభం కావాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావటంతో ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా కాంట్రాక్టు సంస్థ మెడ మీద కత్తి పెట్టి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

మంగినపూడి బీచ్ దశ తిరిగేనా!

కార్తీక మాసంలో సముద్రస్నానాలకు పెట్టింది పేరు మంగినపూడి బీచ్. లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అటువంటి బీచ్ నాడు టీడీపీ హయాంలో బీచ్ ఫెస్టివల్, బోటు షికారు, హెలికాప్టర్ షికారు వంటి అనేక కార్యక్రమాలతో అలరించింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. కూటమి ప్రభుత్వంలోనైనా బందరు బీచ్ దశ తిరిగేనా అని పర్యాటకులు భావిస్తున్నారు.



మంగినపూడి బీచ్ (ఫైల్)

కార్తీక మాసం వస్తే జనసంద్రమే! | టీడీపీ హయాంలో బీచ్ ఫెస్టివల్

- వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంపైనే పర్యాటకుల ఆశలు
- ఎన్నో దర్శనీయ ప్రదేశాలకు నెలవుగా బందరు

(మచిలీపట్నం టౌన్ - ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం వచ్చిందంటే చాలు మంగినపూడి బీచ్ జనసంద్రంగా మారుతుంది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు ఏలూరు, గుంటూరు జిల్లాల ప్రజలు కూడా ఇక్కడికి వచ్చి పుణ్యస్నానాలు చేయడం దశాబ్దాల కాలంగా జరుగుతోంది. యాత్రీకులు స్నానాలు చేసేందుకు అనుకూలంగా ఉండటంతో వేలాది భక్తులు సముద్రస్నానాలకు వస్తుంటారు. కార్తీకమాసంలో ఆదివారం వచ్చిందంటే యాత్రీకుల సందడి ఎక్కువగా ఉంటుంది. కార్తీక పౌర్ణమి నాడు ప్రతి ఏటా రెండు లక్షల మంది భక్తులు సముద్రస్నానాలు చేస్తారు. బీచ్ ఒడ్డున ఉన్న దత్త రామేశ్వరం వద్ద ద్వాదశ బావుల్లో పుణ్య స్నానాలు చేస్తారు. వైసీపీ పాలకులు ఐదేళ్లుగా బీచ్ అభివృద్ధిపై దృష్టి సారించలేదు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి రోజా టూరిజం శాఖ మంత్రి అయి ఉండి కూడా బీచ్‌ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయలేకపోయారు. అంతేకాకుండా వైసీపీ నాయకులు బీచ్ ఒడ్డున ఉన్న మట్టిని అక్రమంగా తవ్వి అమ్మేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా మచిలీపట్నం విచ్చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్తీక మాసం పుణ్య స్నానాలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

నాడు రికార్డు సృష్టించిన బీచ్ ఫెస్టివల్

టీడీపీ హయాంలో మంగినపూడి బీచ్‌లో జరిగిన బీచ్ ఫెస్టివల్ ఒక రికార్డు సృష్టించింది. మూడు రోజుల పాటు యువతను ఆకర్షించే విధంగా బీచ్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. బోటు షికారు, హెలికాప్టర్ షికారు ఏర్పాటు చేశారు. బీచ్ ఒడ్డున మట్టి పోసి ఎత్తైన రోడ్లు నిర్మించారు. బీచ్ ఫెస్టివల్‌లో సినీ నటులతో పాటు యువత వ్యక్తిత్వ వికాసం పై ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు. అప్పట్లో బీచ్ ఫెస్టివల్ యువతను ఉర్రూతలూగించింది. కొనకళ్ల నారాయణరావు, బుల్లయ్య బీచ్‌లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహించారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల మధ్య అప్పట్లో కొల్లు రవీంద్ర మంత్రిగా ఉన్నప్పుడు నిర్వహించిన బీచ్ ఫెస్టివల్ అందరి హృదయాలలో నిలిచిపోయింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంగినపూడి బీచ్ అభివృద్ధిపై దృష్టి సారించలేదు.

మంగినపూడి బీచ్ సినీ షూటింగ్‌లకు అనుకూలమని ఇటీవల ప్రముఖ సినీ నటుడు చిరంజీవి వెల్లడించారు. మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్, పాండు రంగస్వామి దేవాలయం, బందరుకోట వద్ద ఉన్న

షూటింగ్‌లకు అనుకూలం

అంగ్లేయిలు నిర్మించిన మందుగుండుసామాను నిల్వ చేసే భవనాలు, కట్టడాలు షూటింగ్‌కు అనుకూలం. దత్తరామేశ్వరంలో శివుని జటాజూటం నుంచి పడే ఫౌంటేన్ వద్ద భక్తులు స్నానాలు చేస్తుంటారు. ఇవన్నీ షూటింగ్‌లకు అనుకూలమైన ప్రాంతాలుగా సినీ దర్శకులు గుర్తించారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

నిరంతరం ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువుల మధ్య కొట్టు మిట్టాడే ప్రజలకు మంగినపూడి బీచ్ ఒక్కటే ఆటవిడుపు. బీచ్‌ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రీకులకు బీచ్ వద్ద బస చేసే అవకాశం ఉంటుంది. రీసార్ట్‌లు, గెస్టుహౌస్‌లు, బోటు షికారు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. బీచ్ ఒడ్డున ఉన్న దత్త రామేశ్వరంలోని ఏకాదశ బావులలో పుణ్య స్నానాలు చేసేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా భక్తులు తరలివస్తారు. సముద్రస్నానాలు చేసే భక్తులు చిలకలపూడి కీరపండరీపురం పాండురంగస్వామి వారిని సందర్శించడం పరిపాటి. ఈ ఏడాది కార్తీక పౌర్ణమి సందర్భంగా పాండురంగస్వామి ఉత్సవాలు, ఏనుగు అంబారీని మంత్రి కొల్లు రవీంద్ర, గోల్డు ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా మంగినపూడి బీచ్, దత్త రామేశ్వరం, పాండురంగస్వామి దేవాలయం, బందరుకోటలో టూరిజం శాఖ అభివృద్ధి చేస్తే ప్రాచీన నగరమైన మచిలీపట్నం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది. బీచ్ లోని లైట్ హౌస్, బందరు తాజ్ మహల్ సందర్శనీయమైన స్థలాలుగా చాలా కాలం క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తించింది. బందరు పోర్టుతో పాటు వీటిని అనుసంధానం చేస్తూ ఒక ప్యాకేజీగా రూపొందించి పర్యాటకులకు మిగతా 8లో..



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా లక్ష్మీషా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా నూతన కలెక్టర్‌గా జి.లక్ష్మీషాను రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నియమించింది. కలెక్టర్‌గా లక్ష్మీషా, కృతికా శుక్లాల పేర్లు ప్రధానంగా వినిపించినా చివరికి లక్ష్మీషా వైపే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపించింది. కర్ణాటకకు చెందిన లక్ష్మీషా 2013 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి. లక్ష్మీషాను ఏపీకి కేటాయించిన నేపథ్యంలో కర్నూలు జిల్లాలో శిక్షణ నిమిత్తం ట్రైనీ కలెక్టర్‌గా పనిచేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో నూజివీడు సబ్ కలెక్టర్‌గా మొదటి పోస్టింగ్ పొందారు. ఆ తర్వాత పార్వతీపురం మన్యంలోని ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతరం కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, విశాఖపట్నం గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా, తిరుపతి జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోగా, డ్రగ్ అండ్ ఫార్మా డైరెక్టర్ జనరల్, మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సీఈగా పనిచేస్తున్నారు. ఆయన ప్రస్తుతం మహారాష్ట్రలోని అమరావతిలో ఎన్నికల విధుల్లో ఉన్నారు. అక్కడ 20న పోలింగ్, 22న లెక్కింపు జరుగనుంది. ఈ క్రమంలో సెలవు రోజు ఇక్కడికి వచ్చి లక్ష్మీషా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

పిల్లలు దొరికారు

- 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులకు ఎస్పీ అభినందన

6లో

సంక్రాంతి నాటికి గుంతలన్నీ పూడ్చేస్తాం

- నేటి నుంచి పనులు ప్రారంభం : మంత్రి రవీంద్ర

6లో

26న కేంద్ర ప్రభుత్వానికి సమస్యలపై అర్జీలతో హెచ్చరికలు

- రైతు, కార్మిక సంఘాల పిలుపు



దుర్గమ్మ గాజుల అలంకరణ

» ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు.. ఉదయం 4 నుంచి దర్శనం



వన్‌టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యమధర్మరాజు తన సోదరికి పసుపు, కుంకుమ, గాజులు ఇచ్చి ఆశీర్వదించిన రోజు కార్తీకశుద్ధ విదియ (యమ ద్వితీయ) సందర్భంగా ఆదివారం దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారికి చాలా ప్రీతికరమైన గాజుల అలంకరణ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతీ ఏడాది అమ్మవారికి 5 లక్షలకు పైగా గాజులతో అలంకరణ చేస్తారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతిఒక్కరికి కలగాలని, అలంకరణ చేసిన గాజులు ముత్తయిదువులకు ఇవ్వటం జరుగుతుంది. తద్వారా అమ్మవారి ఆశీస్సులు లభిస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మిక. అర్చకస్వాములు, వేదపండితులు మహామండపం 6వ అంతస్తులో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి గాజుల దండలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులకు అమ్మ దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. కార్తీక మాసం సందర్భంగా మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకోవటానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావటంతో ఆలయం వద్ద భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈవో కేఎస్ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ పర్యవేక్షించారు. భక్తులకు ఉచిత ప్రసాదం అందజేశారు.





దుర్గమ్మను దర్శించుకున్న సీఎం చీఫ్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర దంపతులు, ఐఆర్ఎస్ అధికారిణి కోటేశ్వరమ్మ, నగర సీపీ దంపతులు

దుర్గమ్మ సేవలో ప్రముఖులు

కనకదుర్గమ్మను ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు చీఫ్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు, ఈవో రామారావు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం చేశారు. అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందచేశారు.

కనకదుర్గమ్మను ఐఆర్ఎస్ అధికారిణి, దుర్గగుడి మాజీ ఈవో కోటేశ్వరమ్మ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు ఆమెకు అమ్మవారి దర్శనం కల్పించారు.

విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు దంపతులు దర్శించుకున్నారు.

శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు

దేవస్థానంలో శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు నిర్వహించారు. వేదపండితులు, అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన కార్యక్రమాలు జరిగాయి. ఊంజల్ సేవ (సహస్ర దీపాలంకరణ) నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి అమ్మవారి, స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.



కళావేదికపై కూచిపూడి ప్రదర్శన

సూర్యోపాసన సేవ..

ఆదివారం సందర్భంగా దేవస్థానం అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సమస్త జనుల ఆయురారోగ్యాలను కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ, తదితర సేవలను నిర్వహించారు.

కళావేదికపై అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

దేవస్థానం కళావేదికపై ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రాజమహేంద్రవరం గాయత్రీ కళానికేతన్ కళాకారులు నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. శ్రీ విఘ్నరాజం భజే, అష్టలక్ష్మీ స్తోత్రం, మీనాక్షి పంచరత్నం, ముద్దుగారే యశోద, అయిగిరి నందిని, దేవికృతి, లలితా హారతి, క్షీరాబ్ధి కన్యకకు, మహా కాళీ కీర్తన వంటి అనేక కీర్తనలకు చక్కటి అభినయంతో ప్రదర్శించి కనువిందు చేశారు. ఈవో కళాకారులను అభినందించి ప్రశంసాపత్రాలు, లడ్డూ ప్రసాదం అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు, కార్మిక సంఘాల నేతలు

26న కేంద్ర ప్రభుత్వానికి సమస్యలపై అర్జీలతో హెచ్చరికలు

» రైతు, కార్మిక సంఘాల పిలుపు

ధర్నాచౌక్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అర్జీలతో కూడిన హెచ్చరికలు జారీ చేయాలని కేంద్ర రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చారు. రైతు, కార్మిక కేంద్ర సంఘాల రాష్ట్ర నేతల స్టీరింగ్ కమిటీ సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగింది. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చినా తన వైఖరిని మార్చుకోలేదని మండిపడ్డారు. రైతుల డిమాండ్లను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పారిశ్రామిక రంగంలో కార్మికుల హక్కులు, చట్టాలను పరిరక్షించాలన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయకుండా ప్రభుత్వరంగంలో ఉంచాలన్నారు. ఈ నెల 26న దేశవ్యాప్తంగా అన్నిస్థాయిల్లో అధికారులను కలిసి రైతు, కార్మికుల డిమాండ్లతో కూడిన అర్జీలతో సమస్యలు పరిష్కరించాలని హెచ్చరికలు జారీ చేయాలని జాతీయస్థాయిలో రైతు, కార్మిక సంఘాలు నిర్ణయించాయన్నారు. ఏపీలో కూడా ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, వివిధ రంగాల కార్మికులకు పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు, ఇఫ్టూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.పొలారి, రైతు సంఘాల నేతలు కేశవరావు, జి.ఈశ్వర్, పి.జమలయ్య, మరీదు ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న కొల్లు రవీంద్ర, నీలిమ

టీడీపీలో కార్యకర్తలకు గుర్తింపు

» పార్టీ సభ్యత్వ నమోదులో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్/చిట్టినగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 1989లో సభ్యత్వం తీసుకున్న నాటి నుంచి కార్యకర్తలా తెలుగుదేశం పార్టీకి కట్టుబడి ఉన్నానని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం మచిలీపట్నంలోని పార్టీ కార్యాలయంలో రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ, సాధారణ కార్యకర్త నుంచి క్రియాశీల కార్యకర్తగా, డివిజన్ ఇన్‌చార్జిగా, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేశానన్నారు. ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇచ్చినా పార్టీ గెలుపునకు కృషి చేశానని, ఇప్పుడు



హసీంబేగ్‌కు శాశ్వత సభ్యత్వాన్ని అందజేస్తున్న రవీంద్ర, కొనకళ్ల

మంత్రి స్థానంలో ఉన్నా పార్టీకి కార్యకర్తనే అన్నారు. బందరు సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, పార్టీ సభ్యత్వంతో అంచెలంచెలుగా ఎదిగి ఎంపీగా, ఆర్టీసీ చైర్మన్‌గా అయ్యానన్నారు. పార్టీ సభ్యత్వంతో పాటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై కార్యకర్తలు దృష్టి సారించాలన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గోతులమయమైన రోడ్లను కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గొర్రెపాటి గోపీచంద్, కొల్లు నీలిమ, మోటమర్రి బాబాప్రసాద్, హసీంబేగ్, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, కుంచే నాని, తలారి సోమశేఖర్, టీడీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆయన భార్య కొల్లు నీలిమ, గొర్రెపాటి శ్రీనివాసచంద్, టీడీపీ రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షుడు హసీంబేగ్ రూ. లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.



సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ

బీఎస్ఎన్ఎల్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

గుణదల, నవంబరు 3 : వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రధాన ఎజెండా అని బీఎస్ఎన్ఎల్ యూనియన్ నూతన కమిటీ అధ్యక్షుడు టి.హేమచంద్ర కుమార్ తెలిపారు. సేవ బీఎస్ఎన్ఎల్ యూనియన్ అసోసియేషన్ నూతన కమిటీ మూడో సర్వసభ్య సమావేశం నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటీఎస్ చీఫ్ జనరల్ మేనజర్ ఎం.శేషాచలం హాజరయ్యారు. సంస్థలో అంకితభావంతో పనిచేయడంతోపాటు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తుందని హేమచంద్రకుమార్ చెప్పారు. నూతన కమిటీలో కార్యదర్శిగా మద్దాల ప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా జి.వెంకట రమణయ్య మరికొంతమందిని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నుకున్నట్లు చెప్పారు. వీరి పదవీకాలం మూడేళ్లు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చిట్టి ప్రేమ్‌కుమార్, కరుణాకాంత్ కుమార్, పి.శ్రీనివాసరావు, బి.వీరేష్, సీహెచ్. కోటేశ్వరరావు, బి.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితం పట్టని ప్రభుత్వాలు!

» విశ్రాంత ఐఏఎస్ జయప్రకాశ్ నారాయణ

లక్ష్మీపేట/హనుమాన్‌జంక్షన్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంపద సృష్టించాల్సిన ప్రభుత్వాలు సమాజ ఉమ్మడి అవసరాలు పట్టించుకోకుండా ప్రజలను ఉచిత పథకాలపై ఆధారపడి బిచ్చగాళ్లుగా మారుస్తున్నాయని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ అన్నారు. కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంజిసర్కిల్‌లోని అసోసియేషన్ హాలునందు ఆదివారం లారీ ఓనర్స్ ఫౌండేషన్ వృద్ధులు, వితంతువులు, విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేసే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, యువత నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుంటారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాలలో లక్షా 80 వేలమంది వరకు మృతి చెందుతున్నారని, ఈ ప్రమాదాల వలన 10 లక్షల కోట్ల నష్టం వాటిల్లుతుందని, అదే విధంగా 3 శాతం జీడీపీ ఈ ప్రమాదాల పరిహారానికి తరలిపోతుందని అన్నారు. కామినేని పట్టాభిరామయ్య మాట్లాడుతూ, రవాణా రంగానికి జిల్లా లారీ యజమానుల సంఘం విస్తృత సేవలు అందిస్తుందన్నారు. లారీ ఓనర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు రావి గోపాలరావు, ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, ఫౌండేషన్ ఉపాధ్యక్షులు శానంపూడి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జయప్రకాశ్ నారాయణ

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

వాహనరంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణను డ్రైవర్లకు ఇచ్చేలా మోడల్ డ్రైవింగ్ ఇనిస్టిట్యూట్‌ను నెలకొల్పి సేవలందించడం అభినందనీయమని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి జయప్రకాశ్‌నారాయణ అన్నారు. అంపాపురంలోని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ మోడల్ డ్రైవింగ్ ఇనిస్టిట్యూట్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. భారీ వాహనాలతో పాటు కార్లను నడిపేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అధునాతన సిమ్యులేటర్లను ఆయన పరిశీలించారు. ఆరు వరసలతో కూడిన ట్రాక్, యంత్ర విడిభాగాల యూనిట్, డిజిటల్ తరగతి గదులు, మౌలికసదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధునాతన పరికరాలతో కూడిన డ్రైవింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జయప్రకాశ్ నారాయణను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసి



హెవీ వెహికల్ శిక్షణ సిమ్యులేటర్‌ను పరిశీలిస్తున్న జయప్రకాశ్ నారాయణ

యేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, ఉపాధ్యక్షులు కేవీఎస్ చలపతిరావు, కె.సత్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీర వెంకట సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్‌బాబు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు, చెన్నుపాటి వజీర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి నాటికి రోడ్ల గుంతలన్నీ పూడ్చేస్తాం

» నేటినుంచి కార్యక్రమం ప్రారంభం : మంత్రి రవీంద్ర



మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని గోడ్లన్నీ గుంతలమయమయ్యాయని, సంక్రాంతిలోగా రూ. 360 కోట్లతో గుంతలను పూడ్చే కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టామన్నారు. మచిలీపట్నం అభివృద్ధికి రూ.30 కోట్లు ఉపాధి హామీ పనులకు నిధులు కేటాయించామని, రెండేళ్లలో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. ప్రైవేట్, పబ్లిక్ పార్టనర్‌షిప్ కింద నగరంలోని కోనేరుసెంటర్ వంటి ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. 2025 నాటికి బందరు పోర్టు నిర్మాణం పూర్తయ్యేలా పనిచేస్తామన్నారు. ఏపీఎస్ఆర్‌టిసి రాష్ట్ర చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ, వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి వెళ్ళారని, అయినప్పటికీ ఎక్కడా ఎవరికీ ఏ విధమైన ఇబ్బంది లేకుండా ఉద్యోగులకు జీతాలు, వృద్ధులు, వితంతువులకు పింఛన్లు ఇస్తున్నామన్నారు. వైసీపీ పాలనలో 15వ తేదీ నాటికి ఉద్యోగులకు జీతాలిచ్చేవారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, లంకే నారాయణ ప్రసాద్, ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, కాగిత వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

7లోగా డ్వాక్రా మహిళల డేటా పూర్తి చేయాలి

» మెప్మా డైరెక్టర్ నారాయణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న నారాయణ

గుడివాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మెప్మాలోని స్వయం సహాయక గ్రూపుల డేటా ప్యూరిఫికేషన్ కార్యక్రమాన్ని ఈ నెల 7వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా మెప్మా డైరెక్టర్ వెంకటనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక కైకాల సత్యనారాయణ పురపాలక కళామందిరంలో ఎస్‌హెచ్‌జి ప్రొఫైలింగ్ యాప్‌ను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్‌లు ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 5 మున్సిపాల్టీలకు సంబంధించిన డ్వాక్రా సంఘాలకు మెప్మా యాప్‌కు సంబంధించి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యాప్‌ను తీసుకువచ్చిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా ప్రతి డ్వాక్రా మహిళ వివరాలను పొందుపరచి, వ్యాపారాలు నిర్వహించేందుకు యాప్‌ను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ నెల 7వ తేదీ లోపు మున్సిపాల్టీ పరిధిలోని స్వయం సహాయక గ్రూపుల సభ్యులు వివరాలను యాప్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఎం.యు సిబ్బంది, మెప్మా సిబ్బంది, సి.ఎం.ఎంలు, సి.వోలు, ఆర్.పిలు, డి.ఇ.వోలు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి రాక

మచిలీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుబాశ్ జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు రామచంద్రాపురం నుంచి ఆయన బయలుదేరి 10.30 గంటలకు మచిలీపట్నం ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి చేరుకుంటారు. 11 గంటలకు నియోజకవర్గ టీడీపీ కార్యాలయం వద్ద జిల్లాకు చెందిన కూటమి నేతలతో సమావేశమవుతారు. 1.55గంటలకు జిల్లాపరిషత్ సమావేశపుహాలులో అధికారులతో జరిగే సమీక్షాసమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4.15గంటలకు మచిలీపట్నం-కోన రహదారిపై శివగంగ గుడివద్ద గుంతలను పూడ్చే కార్యక్రమంలో పాల్గొంటారు. 4.30 గంటలకు రోడ్డుమార్గం ద్వారా తాడేపల్లిగూడెం బయలుదేరి వెళతారు.

కనపర్తి క్షమాపణ చెప్పాలి

» బడే శేషగిరిరావు

అవనిగడ్డ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తన కుమారుడు గౌతమ్‌పై అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసే క్రమంలో అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు అసభ్యంగా బూతులు తిట్టడంపై న్యాయవాది బడే శేషగిరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కనపర్తి శ్రీనివాసరావు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయనపై రూ.కోటి పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. అవసరమైతే భౌతికదాడులకు పాల్పడతామని కనపర్తి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేస్తూ బెదిరింపులకు భయపడేదిలేదని ఆదివారం ఒక ప్రకటనలో బడే శేషగిరిరావు స్పష్టం చేశారు.

పిల్లలు దొరికారు

» 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులకు ఎస్పీ అభినందన



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ సుభాన్

మచిలీపట్నం టౌన్/నందివాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నాగులేరు చెరువు వద్ద గుడిసెల్లో నివసిస్తూ అదృశ్యమైన ముగ్గురు మైనర్ల ఆచూకీ తెలిసింది. గిరిజనులకు చెందిన పిల్లల ఆచూకీ కోసం ఎస్పీ ఆర్.గంగాధరరావు, జిల్లా కలెక్టర్ బాలాజీలు 30 బృందాలను నియమించారు. జిల్లాను జల్లెడ పట్టి పోలీసులు గాలించగా ముగ్గురు పిల్లలు తుమ్మా శ్రీనివాసరావు, తుమ్మా దుర్గారావు, తుమ్మా నాగేశ్వరరావు నందివాడలో దొరికారు. ఈ సందర్భంగా డీఎస్పీ అబ్దుల్ సుబాన్ మీడియాకు వివరాలు తెలిపారు. కాలేఖాన్‌పేటలో నాగులేటి ఒడ్డున గుడారాల్లో నివసిస్తున్న తుమ్మా రాఘవప్రసాద్‌కు చెందిన ముగ్గురు పిల్లలు అదృశ్యం కావడంతో రాఘవప్రసాద్ శనివారం ఇనకుదురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పిల్లలు స్కూల్‌కు వెళ్లి ఇంకా రాలేదని ముందుగా అనుకున్నారు. పిల్లలు స్కూల్‌కు వెళ్లలేదని తండ్రి రాఘవప్రసాద్ తెలుసుకుని దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. మచిలీపట్నంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న తుమ్మా రాఘవప్రసాద్ అవనిగడ్డకు బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇది తెలుసుకున్న పిల్లలు అవనిగడ్డ నడిచి వెళుతుండగా, అటుగా వెళుతున్న ఆటోడ్రైవర్ ముగ్గురు పిల్లలను అవనిగడ్డ తీసుకువెళ్లాడు. పిల్లలు బంధువుల ఇల్లు గుర్తుపట్టకపోవడంతో ఆటో డ్రైవర్ తమ స్వగ్రామమైన నందివాడ మండలం తమిరిశకు పిల్లలను తీసుకువెళ్లాడు. ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు అవనిగడ్డ, నందివాడ పోలీసులు పిల్లల కోసం గాలించగా తమిరిశలో ఆటోడ్రైవర్ అయ్యప్ప ఇంట్లో ఉన్నట్టు తేలింది. దీంతో ఇనకుదురు, అవనిగడ్డ, నందివాడ పోలీసులు పిల్లలను ఆదివారం సాయంత్రం మచిలీపట్నం డీఎస్పీ కార్యాలయానికి తీసుకువచ్చారు. కేసును వేగంగా ఛేదించినందుకు ఎస్పీ గంగాధరరావు బృందాలను అభినందించారు. తల్లి ఇటీవల మృతిచెందడంతో తండ్రిని వెతుక్కుంటూ పిల్లలు అవనిగడ్డకు వెళ్లడం తెలిసి అందరి హృదయాలను కదల్చివేసింది.



ముగ్గురు పిల్లలతో తండ్రి రాఘవప్రసాద్

హంసలదీవిలో పర్యాటకుల సందడి

కోడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కోడూరు మండల శివారు హంసలదీవి బీచ్‌లో పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది. ఆదివారం సెలవు దినం కావటంతో వివిధ ప్రాంతాల నుంచి బీచ్ వద్దకు పర్యాటకులు కుటుంబసమేతంగా స్నానాలు ఆచరిస్తూ సరదాగా గడిపారు.





కెవివి సత్యనారాయణకు నియామక పత్రం అందజేస్తున్న కేశన శంకరరావు)

జనగణనతో పాటు బీసీ కులగణన చేయాలి

» చట్టసభల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలి

» చంద్రబాబు బీసీ రక్షణ చట్టం అమలు చేస్తాననడం ముదావహం

» కేశన శంకరరావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జనగణనతో పాటు బీసీ కులాల గణన కూడా చేపట్టి బీసీలకు అన్ని రంగాల్లో రావాల్సిన రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక హోటల్‌లో ఆదివారం జిల్లాస్థాయి బీసీ సంక్షేమ సంఘ నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. వైసీపీ పాలనలో బీసీల రిజర్వేషన్ సరిగా అమలు చేయకపోవడం వల్ల 16 వేల మంది బీసీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రిజర్వేషన్లు పొందలేకపోయారన్నారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా కె.వి.వి. సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అందే జగదీష్‌ను నియమిస్తూ నియామక పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో పెడన నియోజకవర్గ బీసీ నాయకుడు బొర్రా కాశీవిశ్వేశ్వరరావు, వీరంకి శ్రీనివాసరావు, కాగిత వాసు, తుమ్మా కామేశ్వరి, మెతుకుమిల్లి దేవకి, రాజ్యలక్ష్మి, బేగం, సురేఖ, చెన్ను రంగారావు, రాగి చంద్రశేఖర్, కాగిత రవిబాబు, కాగిత సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను అడ్డుకున్న గ్రామస్థులు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు

మోపిదేవి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి రవాణా చేసేందుకు వచ్చిన పొక్లెయినర్, ట్రాక్టర్లను ఆదివారం గ్రామస్థులు అడ్డగించిన సంఘటన మండలంలోని నాగాయితిప్ప శివారులో జరిగింది. కోసూరువారిపాలెం, నాగాయితిప్ప గ్రామాలకు పొలిమేర డొంకగా పిలువబడే ప్రదేశంలో కృష్ణానది నుంచి ఇసుక తరలించేందుకు అవనిగడ్డకు చెందిన ట్రాక్టర్లు, పొక్లెయినర్ చేరుకున్నాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు హటాహటిన అక్కడికి వచ్చి నదిలోకి దిగిన ట్రాక్టర్లు, మిషన్‌ను కరకట్టపైకి తీసుకెళ్లాల్సిందిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న కృష్ణానది నుంచి ఇసుక తరలించేందుకు మీకు ఎవరు అనుమతులు ఇచ్చారో చూపాలని గ్రామస్థులు వాహనదారులను నిలదీశారు. పొరుగు ప్రాంతాలకు చెందిన వ్యక్తులు గ్రామంలో ఇసుక తరలించేందుకు రావటం ఏమిటని ప్రశ్నించారు. గ్రామస్థుల సమాచారంతో వీఆర్వో రమణ ఘటనాస్థలానికి చేరుకుని మోపిదేవి మండలంలో సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న నాగాయితిప్ప, కోసూరువారిపాలెం కృష్ణానది నుండి ఇసుక తరలించేందుకు ఏ విధమైన అనుమతులు లేనందున వెంటనే తిరిగి వెళ్లిపోవాలంటూ సూచించారు. కృష్ణానదిలో ఇసుక తవ్వేందుకు ప్రయత్నిస్తే ట్రాక్టర్లు, యంత్రాన్ని సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. దీంతో వారు వెనుతిరిగి వెళ్లిపోయారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 130,139, 150
చికెన్ విత్ స్కిన్ 250
చికెన్ స్కిన్‌లెస్ 260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

నేటి నుంచి ఉయ్యూరుకు బస్సు సర్వీస్ ప్రారంభం

గన్నవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి ఉయ్యూరుకు బస్సు సర్వీసును సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 7.55 గంటలకు డిపోలో బయలుదేరి కేసరపల్లి, అజ్జంపూడి, బుద్ధవరం, బూతిమిల్లిపాడు, తరిగొప్పల, మానికొండ, కాలవపాముల, కాటూరు, కడవకొల్లు మీదుగా 9.25కి ఉయ్యూరు చేరుతుందని, అక్కడ 9.35కి బయలుదేరి అదే రూటులో గన్నవరానికి 11.05కు చేరుతుందని, మరలా సాయంత్రం 4.10కి గన్నవరంలో బయలుదేరి 5.40కి ఉయ్యూరు బస్టాండ్‌కు.. అక్కడ 5.50కి బయలుదేరి రాత్రి 7.20కి గన్నవరం డిపోకు బస్సు చేరుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నెట్‌బాల్ జిల్లా జట్టుకు బాపులపాడు విద్యార్థుల ఎంపిక

హనుమాన్‌జంక్షన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు అండర్-19 విభాగంలో కృష్ణాజిల్లా జట్టులో బాపులపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం టీవీ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం విజయవాడలో మేరీస్టెల్లా కాలేజీలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో షేక్.హనీఫ్, నాగళ్ల కవితలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 8న నెల్లూరుల్లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

జంక్షన్ లయన్స్ క్లబ్‌కు గవర్నర్ గద్దె శేషగిరిరావు ప్రశంస

హనుమాన్‌జంక్షన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవా కార్యక్రమాలు అందిస్తున్నందుకు హనుమాన్ జంక్షన్ లయన్స్ క్లబ్‌కు లయన్స్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు ప్రత్యేక అభినందనలు అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు కళ్లేపల్లి నారాయణరావు తెలిపారు. ఆదివారం విజయవాడలో లయన్స్ కేబినెట్ సమావేశంలో గవర్నర్ ప్రశంసలు తెలియజేసినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో పేదలకు అవసరమైన సేవా కార్యక్రమాలను విస్తృతంగా అందించడానికి క్లబ్ సభ్యులు మరింత కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్ట్ గవర్నర్ కంకణాల శ్రీనివాసరావు, జంక్షన్ ప్రాంత నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, తాడి రంగారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి సాయం అందజేస్తున్న నరహరిశెట్టి నాగవరప్రసాద్

విద్యార్థినికి ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : చదువుకు ఆర్థిక ఇబ్బంది అడ్డుకాకూడదనే ఉద్దేశంతో ఆర్థికసాయం అందించినట్లు నరహరిశెట్టి నాగవరప్రసాద్ తెలిపారు. ఉమామహేశ్వపురానికి చెందిన నల్ల సంధ్య ఇంజనీరింగ్ చదువు నిమిత్తం రూ.14 వేలు ఆర్థికసాయాన్ని టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి వెంకన్నతో కలిసి ఆదివారం అందజేశారు. చదువులో ప్రతిభ కనబరిస్తే ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకువచ్చి మరింత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్నేపల్లి వెంకటేశ్వరరావు, గోవిందయ్య, సుల్తాన్‌బాషా, వెంకటేశ్వరరావు, శివ, అశోక్ పాల్గొన్నారు.



వలస కార్మికుల పిల్లలకు దుస్తులను అందజేస్తున్న పరిచూరి రామకృష్ణ

చిన్నారులకు నూతన దుస్తులు అందజేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : భావిభారత పౌరులైన చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు నూతన దుస్తులను అందించామని కమ్మవారి ఐక్య సేవా సమితి అధ్యక్షుడు పరుచూరి రామకృష్ణ అన్నారు. వీరవల్లి, రంగయ్యప్పారావుపేట, బాపులపాడు శివారు ప్రాంతాల్లో నివసించే వలస కార్మికుల కుటుంబాల్లోని చిన్నారులకు ఆదివారం నూతన దుస్తులను అందజేశారు. తన కుమార్తె వైష్ణవి 16వ వర్ధంతి సందర్భంగా కెవిఐఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పొట్లూరి సత్య ఫణీంద్ర, పరుచూరి సుకన్య పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈ సత్యపాండురంగ

అభివృద్ధి పనుల పరిశీలన

ఉయ్యూరు, నవంబరు 3 : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులను మున్సిపల్ శాఖ డీఈ అవుల సత్య పాండురంగ ఆదివారం పరిశీలించారు. ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల రోడ్డు 14వ వార్డులో రూ. 97.13 లక్షల అంచనాతో 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ నిధులతో నిర్మిస్తున్న 250 కేఎల్ ఈఎల్‌ఎస్‌ఆర్ వాటర్ ట్యాంకు పనులను వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎల్. పోతురాజుతో కలసి పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. రాజర్షినగర్‌లో సీసీ డ్రెయిన్, దుర్గా ఎస్టేట్‌లో వాకింగ్ ట్రాక్ పెన్సింగ్ పనులను పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.





నాడు.. ఆరుగొలనులో వరదలకు కుళ్లిపోయిన వరి పంట.. నేడు.. కళకళలాడుతున్న మినుము

ముంచిన వరద.. పరిహారంతో పైరు

- రైతులకు సకాలంలో అందిన పరిహారం
- ఆరుగొలనులో ముంపునకు గురైన పొలంలో మినుము సాగు
- ఏపుగా కళకళలాడుతున్న పైరు

(హనుమాన్‌జంక్షన్‌రూరల్ - ఆంధ్రజ్యోతి)

గత నెల సెప్టెంబరులో వచ్చిన వరద తాకిడికి ఆరుగొలను ప్రాంతంలో మోకాటి లోతు వరద నీటిలో నానికుళ్లిపోయిన వరిపంటను పొలంబాటలో ఆంధ్రజ్యోతి ప్రచురించింది. కుళ్లిపోయి ఎరుపురంగులోకి మారిపోయిన అదే పొలంలో మినుము పంట వేసి విపత్కర పరిస్థితులను సైతం అనువుగా మార్చుకున్నాడు ఆరుగొలనుకు చెందిన రైతు పెదర్ల యామినీ ప్రసాద్. బుడమేరు ముంపుతో గత సెప్టెంబరు 14వతేదీ వరకు మోకాళ్ల లోతు నీళ్లలో ఉన్న పొలాన్ని చూసిన రైతులు ఆశలు వదలుకున్నారు. చేతిలో డబ్బులేక పరిహారం అందుతుందో లేదో అన్న మీమాంసలో రెండో పంట అయినా వేయగలమా అని అనుకున్నారు. అన్నదాతకు అండగా నిలచిన ప్రభుత్వం పరిహారం సకాలంలో అందించడంతో రైతులో ఆశలు చిగురించాయి. వరదనీరు తగ్గు ముఖం పట్టగానే దుక్కి దున్ని అదునుకు తగ్గట్టుగా మినుము పంట సాగుచేశారు. 40రోజుల్లోనే పంట ఏపుగా పెరిగి కళకళ లాడుతున్నాయి. 45రోజులు క్రితం వరద ముంపుతో సముద్రాన్ని తలపించిన పొలం మినుము పైరుతో పచ్చదనం సంతరించుకుంది. కొన్ని రోజుల్లోనే మినుము పంట చేతికి రానుందని రైతులు తెలిపారు.

రెండు పంటలు వేయగలమనే నమ్మకం వచ్చింది



వరద ముంపుతో పెట్టుబడి మొత్తం నీటిపాలయిందని కానీ పరిహారం సకాలంలో అందడంతో 12 ఎకరాల్లో మినుము సాగు చేశాను. ఇంకొక 16 రోజుల్లో పంట చేతికి వస్తుందని, ఎకరానికి 10 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండవ పంటగా ప్రభుత్వం సాగునీరిస్తే వరి లేదా అపరాలు సాగు చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. వరద వచ్చి రైతును ముంచేస్తే... ప్రభుత్వం ఇచ్చిన పరిహారంతో మినుము పంటతో నిలదొక్కుకోగలిగామన్నారు.

- యామినీ ప్రసాద్, ఆరుగొలను



షోకు తరలివచ్చిన శునకరాజాలు

ఆకట్టుకున్న డాగ్‌షో

పెనమలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ది కెన్నెల్ అసోసియేషన్ ఆఫ్ విజయవాడ వారు కానూరు షాంరాక్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన విజయవాడ డాగ్‌షోకు విశేష ఆదరణ లభించింది. విజయవాడ చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి షోకు శునకరాజాలు తరలివచ్చాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీఐజీ సెంథిల్ కుమార్, తాడిగడప మునిసిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్‌లు మాట్లాడుతూ, ఉత్సాహంగా నిర్వహించిన డాగ్‌షోను అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి మూగజీవాల పట్ల అవగాహన ప్రజల్లో పెంచడం అవసరమని వ్యాఖ్యానించారు. విజేతలకు హైదరాబాద్ ప్లేమేట్ కెన్నెల్స్ కార్యదర్శి కే ప్రవీణ్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో షాంరాక్ పాఠశాల కార్యదర్శి సుమన్ త్యాగరాజ్, అధ్యక్షులు మోనికా సుమన్, ప్రిన్సిపాల్ భారతీధర్ పాల్గొన్నారు.

టీడీపీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ ప్రతిఫలం..

కంకిపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ టీడీపీలో గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ నాయకులు, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శి వణుకూరు విక్రమ్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి పాలకవర్గం సభ్యులుగా నియమితులైన వైద్యం శాంతారామ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ, తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్ట పడిన ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్న దానికి శాంతారామ్‌నే ఒక నిదర్శనమన్నారు.



యూనియన్ బ్యాంకు స్పోర్ట్స్‌మీట్ బెలూన్లు ఎగురవేసి ప్రారంభిస్తున్న బ్యాంకు రీజినల్ మేనేజర్ కె.వెంకట్రావు

ఉల్లాసంగా యూనియన్ బ్యాంక్ స్పోర్ట్స్ మీట్

ఉయ్యూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల క్రీడామైదానంలో యూనియన్ బ్యాంక్ స్పోర్ట్స్‌మీట్‌ను బ్యాంక్ రీజినల్ మేనేజర్ కె.వెంకట్రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజిలెన్స్ అవేరెనెస్ వీక్- 2024లో భాగంగా స్పోర్ట్స్‌మీట్ నిర్వహిస్తున్నామని, ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో స్పోర్ట్స్ మీట్ వంటి కార్యక్రమాలు ఉల్లాసంగా గడిపేందుకు అవకాశం ఉంటుందన్నారు. విజిలెన్స్ అవేరెనెస్‌లో భాగంగా ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించామన్నారు. బ్యాంకు ఉద్యోగులు, సిబ్బందికి క్రికెట్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ కెఎల్‌వి రామలింగారెడ్డి, తాతాజీ, విజిలెన్స్ ఆఫీసర్ కె.వెంకటరాజు, పలుశాఖల మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఉంగుటూరు విద్యార్థులు

ఉంగుటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ)ఆధ్వర్యంలో ఈ నెల 1న గూడూరులో నిర్వహించిన జిల్లా స్థాయి రగ్బీ ఎంపిక పోటీల్లో ఉంగుటూరు జడ్పీహైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు క్రీడలో తమ సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జే.అమ్మన్న తెలిపారు. బాలికల విభాగంలో 9వ తరగతి చదువుతున్న సీహెచ్ విన్నీ, యు.చంద్రిక, జి.నిఖిత, బాలుర విభాగంలో కే.నాగసంతోష్, టి.హర్షవర్ధన్, డి.చేతన్‌సింహ ఎంపికయ్యారన్నారు. వీరంతా ఈ నెల 9. 10తేదీల్లో వైఎస్సార్ కడప జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి రగ్బీపోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఇన్‌చార్జి హెచ్‌ఎం అమ్మన్న

జేఎంజేలో శ్రవంతి విశ్రాంతి మందిరం నిర్మాణం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మిషనరీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్థానిక గుడివాడ రోడ్డులోని జేఎంజే జూనియర్ మహిళా కళాశాలకు శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ బహుమతిగా హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్రాంతి మందిరం నిర్మిస్తున్నట్లు ఆ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ తెలిపారు. హాస్టల్‌లో చదువుకునే విద్యార్థినులను వారి తల్లిదండ్రులు చూడడానికి వచ్చినపుడు గార్డెన్‌లో చెట్ల కింద విశ్రాంతి తీసుకుంటూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని కళాశాల యాజమాన్యం ట్రస్ట్ దృష్టికి తీసుకురావడంతో ట్రస్ట్ నిర్వహిస్తున్న విద్యాయజ్ఞంలో భాగంగా కళాశాల ఆవరణలో దాదాపు రూ.4లక్షలు అంచనా వ్యయంతో మందిరం నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణం పూర్తి కావచ్చిందని త్వరలోనే దానిని కళాశాలకు అంకితం చేయనున్నట్లు సత్యప్రసాద్ వివరించారు.

ఎస్సీ వర్గీకరణను పునరుద్ధరించాలి

ఏపీ ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మాదిగ హక్కులను కాలరాస్తు 2004లో రద్దుచేసిన ఎస్సీ వర్గీకరణను పునరుద్ధరించాలని ఏపీ ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈ నెల 5న విజయవాడలో జరగనున్న జాతీయ మహాసభ సందర్భంగా ఆదివారం జంక్షన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మార్పీస్ దాదాపు 20 ఏళ్ల పోరాటం చేసిన నేపథ్యంలో వర్గీకరణ అమలు చేసే అధికారం రాష్ట్రానికి ఉందని ఈ ఏడాది ఆగస్టులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, కోర్టు తీర్పు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ కులాల రిజర్వేషన్లు కులాల ప్రాతిపదికన అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ సాధన కోసం చేస్తున్న పోరాటం నేపథ్యం లో విజయవాడలో జరగనున్న జాతీయ మహాసభను జయప్రదం చేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొకినాల సాంబశివరావు మట్టా వరసాయిప్రసాద్, మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు కొమ్మిన కవిత, నిమ్మకూరి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న అనుమోలు ప్రభాకరరావు, చెన్నుపాటి శ్రీనివాస్

వైద్యశిబిరానికి విశేష ఆదరణ

పెనమలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతినెల మొదటి ఆదివారం అనుమోలు ఆదరణ ట్రస్టు ఆధ్వర్యంలో జరిపే ఉచిత వైద్యశిబిరం ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగింది. పోరంకి క్యాపిటల్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో అనుమోలు ప్రభాకరరావు నేతృత్వంలో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి షుమారు 250 మంది స్థానికులు హాజరై షుగరు, బీపీ పరీక్షలు చేయించుకొన్నారు. వారికి అనుమోలు ట్రస్టు తరపున ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి శ్రీనివాస్, బొంగరాల అబ్రహాం, కంచర్ల రాధ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గన్నవరం : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవా లని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జనసేన పార్టీ రాష్ట్ర ఎలక్షన్ మీడియా కో-ఆర్డినేటర్ గరికపాటి శివశంకర్ సహకారంతో శంకర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, కూటమి నాయ కులు పచ్చిపాళ్ల లక్ష్మణరావు, కోలవెన్ను నాని, జాస్తి వెంకటేశ్వరరావు, పొట్లూరి బసవ రావు, దొంతు చిన్న, బుస్సే సరితాదేవి తదితరులు పాల్గొన్నారు.



గన్నవరం పాఠశాలలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పట్టభద్రులందరూ ఓటు హక్కును పొందాలి


గన్నవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న అన్నారు. మండలంలోని ముస్తాబాద గ్రామ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. అర్హులందరూ ఓటర్లుగా చేరేందుకు చివరి తేదీ 6 అని తెలిపారు. తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమ, పాలడుగు మల్లికార్జున రావు, కొసరాజు సాయి, కూరేటి వాసు, కలపర్తి అనిల్, కడియాల రాజా, మేడేపల్లి సురేష్, పాలడుగు రత్నారావు, బసవరావు, మేడేపల్లి ధనకోటేశ్వరరావు పాల్గొన్నారు.



ముస్తాబాదలో పట్టభద్రుల ఓటు నమోదు చేస్తున్న టీడీపీ నాయకుల

కంకిపాడులో టీడీపీ సభ్యత్వ నమోదు ..

కంకిపాడు : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. కంకిపాడులో ఆదివారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, మండలంలోని 20 గ్రామాల్లో అత్యధికంగా టీడీపీ సభ్యత్వం నమోదు చేసే విధంగా ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, వణుకూరు విక్రమ్, బొర్రా వెంకట్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడులో టీడీపీ సభ్యత్వ నమోదులో తుమ్మలపల్లి తదితరులు




కార్తీక సందడి



● భవానీ ద్వీపంలో పర్యాటకుల కోలాహలం ● వనసమారాధనకు కుటుంబ సమేతంగా వచ్చిన సందర్శకులు





కార్తీకమాసం ప్రవేశంతోనే తొలి ఆదివారం భవానీ ద్వీపం సందర్శకులతో సందడి వాతావరణం నెలకొంది. ఇటీవల వచ్చిన వరదలకు ద్వీపం తీవ్రంగా దెబ్బతిన్నా కార్తీకమాసం సందర్భంగా అశేషంగా వచ్చే సందర్శకులను దృష్టిలో పెట్టుకుని ఏపీటీడీసీ అధికారులు తమ శక్తి మేరకు ద్వీపాన్ని సగం మేర అందుబాటులోకి తెచ్చారు. కార్తీక మాసంలో వనభోజనాలు చేయాలన్న ఉద్దేశంతో సకుటుంబ సపరివార సమేతంగా ద్వీపానికి తరలి వచ్చారు. ముందుగా హరిత బెర్మ్‌పార్క్‌కు చేరుకున్న పర్యాటకులు అక్కడి బోటింగ్ యూనిట్‌లో టికెట్ తీసుకుని మెకనైజ్డ్ బోట్లపై ద్వీపానికి చేరుకున్నారు. అక్కడికి చేరుకున్న తర్వాత రమణీయమైన ప్రకృతిని ఆస్వాదించారు. ఇటీవల వరదల వల్ల సంభవించిన నష్టాలను పరిశీలించారు. ద్వీపంలో చైల్డ్ గేమ్స్ ఏరియాలో పిల్లలు, పెద్దలు కలిసి సందడి చేశారు. చాలా మంది పర్యాటకులు కృష్ణానదిలో స్పీడ్ బోటింగ్ చేశారు. భవానీ ద్వీపం అంతా కలియ తిరిగారు. చాన్నాళ్ల తర్వాత ద్వీపంలోని రెస్టారెంట్లు కళకళలాడుతూ కనిపించాయి. వనభోజనాలు చేసేవారికి ఏపీటీడీసీ అధికారులు ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు చేపట్టారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ



● రైలు నుంచి దూకేసిన మహిళ
● ప్రాణాలతో కాపాడిన పోలీసులు

8 గంటలు.. కాల్వలోనే..!


● మహిళ గుర్తింపు..


● కొబ్బరిమట్ట అందిస్తూ..


● దగ్గరికొచ్చాక చేయి అందిస్తూ..


● రెండు చేతుల్ని పట్టి పైకి లాగుతూ..

విజయవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పుట్టింటికి వెళ్తానని చెప్పి బయటకొచ్చిన మహిళ అక్కడికి వెళ్లలేదు. తెల్లరేసరికి కాల్వలో నానుతూ కనిపించింది. దాదాపు 8 గంటలపాటు నీళ్లలో నానుతున్న ఆ మహిళను పోలీసులు ప్రాణాలతో బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటన విజయవాడలో జరిగింది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన షేక్ జిన్నిత్ ఉన్నీసా (41) భర్త ఖాదర్ వలీతో కలిసి నివసిస్తోంది. శనివారం రాత్రి తన ఇంటి నుంచి పుట్టింటికి వెళ్తానని వెళ్లి వస్తానని చెప్పింది. కానీ వెళ్లలేదు. తెనాలి రైల్వేస్టేషన్‌కు చేరుకుని విజయవాడకు వచ్చే రైలు ఎక్కింది. రైలు విజయవాడలోని పూలమార్కెట్ దాటి, పీఎన్‌బీఎస్ వద్దకు వస్తుండగా బందరు కాల్వలోకి దూకేసింది. తర్వాత కాల్వలో ఉండే చెత్తను పట్టుకుని నెమ్మదిగా ఒడ్డుకు చేరింది. మొక్కలను పట్టుకుని పైకి ఎక్కాలని భావించినా సాధ్యపడలేదు.

రాత్రంతా నీళ్లలో ఉండిపోయింది. రాత్రి 9 గంటల సమయంలోనే దూకేసిందని పోలీసులు చెబుతున్నారు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసు కంట్రోల్ రూంకు ఫోన్ చేశారు. విధుల్లో ఉన్న కృష్ణలంక బ్లూకోట్స్ కానిస్టేబుల్ వీరంకి నాగేశ్వరరావు, హోంగార్డు అబ్దుల్ వజీర్ కంట్రోల్ రూం నుంచి సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఒడ్డుకు కొంతదూరాన ఉన్న ఆమెకు పక్కనే ఉన్న కొబ్బరాకు అందజేశారు. దాని ద్వారా ఉన్నీసాను నెమ్మదిగా ఒడ్డు వరకు లాక్కొచ్చారు. అనంతరం ఆమెను విచారించగా భర్త ఖాదర్ వలీ ఫోన్ నంబరు ఇచ్చింది. పోలీసులు వెంటనే అతడికి ఫోన్ చేశారు. తన భార్యకు మతిస్థిమితం లేదని అందుకే కాల్వలోకి దూకిందని వివరించాడు.

పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. 8 గంటల పాటు నీళ్లలో ఉండడంతో శరీరమంతా పాచి పట్టింది. ప్రస్తుతం ఆమె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. కేసును కృష్ణలంక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ

కృష్ణలంక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టమ్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అలాగే డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మీనా ఆ ప్రకటనలో కోరారు.

ఇసుక మాఫియాకు డ్రోన్లతో చెక్

(5వ పేజీ తరువాయి)

కంటికి కనిపించని ఇసుక గుట్టలు డ్రోన్ల కంట్లో మాత్రం పడుతున్నాయి.

2,125 మెట్రిక్ టన్నుల ఇసుక సీజ్

నెల రోజుల వ్యవధిలో ఎన్టీఆర్ జిల్లా పోలీసులు 2,125 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేశారు. మొత్తం 150 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 195 మందిని అరెస్టు చేశారు. మొత్తం 100 కేసులు నమోదు చేశారు. రీచ్‌ల్లో నిలిచిపోయిన నీరు ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతోంది. దీనితో ఇసుక తవ్వకాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణకు రహస్యంగా టిప్పర్లలో ఇసుక వెళ్లిపోవడాన్ని సీపీ సీరియస్‌గా తీసుకున్నారు. తెలంగాణను ఆనుకుని ఉన్న గ్రామాల్లో 17 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. వాటిని విజయవాడలోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. పగటిపూట కంటే రాత్రి పూటే ఇసుక అక్రమ రవాణా జరిగే అవకాశాలు ఉండడంతో చెక్‌పోస్టుల వద్ద నైట్ విజన్ కెమెరాలను అమర్చారు. పోలీస్ కమిషనర్ రాత్రిపూట కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉంటూ చెక్‌పోస్టులను స్వయంగా పరిశీలిస్తున్నారు.

ఇసుక గుట్టలను కనిపెడుతున్న డ్రోన్లు

పగటిపూట మాత్రం విజయవాడ నుంచి ప్రత్యేక బృందాలను అక్కడికి పంపుతున్నారు. వారి వెంట డ్రోన్లు వెళ్తున్నాయి. రీచ్‌లతోపాటు పరిసర ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేసినప్పుడు ఎత్తయిన ఇసుక గుట్టలు కనిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులతో కలిసి వాటిని సీజ్ చేస్తున్నారు. ఇసుక రీచ్‌లకు వచ్చే వాహనాలను ఈ బృందాలు తనిఖీ చేస్తున్నాయి. జీపీఎస్ ఉన్న వాహనాలను మాత్రమే రీచ్‌ల్లోకి పంపుతున్నారు.

తుప్పల మాటున ఇసుక

ఇసుక మాఫియా రహస్యంగా ఉంచిన ఇసుకను పోలీసు డ్రోన్లు బయటకు రప్పిస్తున్నాయి. డ్రోన్లు ఎగుర వేసినప్పుడు కనిపించిన ఇసుక గుట్టలు రీచ్‌లకు దూరంగా, మారుమూల ప్రదేశాల్లో ఉన్నాయి. కొన్ని గుట్టలు ఎత్తుగా పెరిగిన తుప్పల వెనుక ఉన్నాయి. ఈ గుట్టలన్నీ అక్రమంగా ఏర్పాటు చేసినవేనని పోలీసులు గుర్తించారు. గ్రామాల్లో ఉన్న ప్రజలకు చైతన్యం తీసుకురావడానికి పోలీసులు ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఇసుక రీచ్‌ల్లోకి జీపీఎస్ వాహనాలు వెళ్లాలని స్పష్టం చేస్తున్నారు. జిల్లా నుంచి ఇసుకతో ఏ వాహనం తెలంగాణ సరిహద్దులోకి ప్రవేశించినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు. తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో ఉన్న వాహనదారులందరికీ ముందుస్తుగా నోటీసులు అందజేస్తున్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

మంగినపూడి బీచ్ దశ తిరిగేనా!

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక వాహనాలు, ఒక గైడ్‌ను ఏర్పాటు చేస్తే ప్రాచీన నగరమైన మచిలీపట్నం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది.

అభివృద్ధిపై మంత్రి కొల్లు హామీ

మంగినపూడి బీచ్‌లో ఇటీవల జరిగిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర బీచ్ అభివృద్ధిపై దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు కావాల్సిన నిధులను తీసుకొచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. బీచ్‌ని అభివృద్ధి చేసే ప్రణాళికకు రంగం సిద్ధం చేస్తే ఐదేళ్లలో ఆశించిన విధంగా బీచ్ అభివృద్ధి చెందుతుంది. ఇటీవల ఫొటోగ్రాఫర్ల సంఘ నాయకులు ప్రీ వెడ్డింగ్ షాట్‌లు తీసుకుంటామని, అనుమతులు ఇప్పించాలని మంత్రిని కోరారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం మచిలీపట్నం వస్తున్న దృష్ట్యా ఈ అంశంపై చర్చ జరిగితే ఆశించిన విధంగా మంగినపూడి బీచ్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. బీచ్ వద్ద ఉన్న పోలీస్‌స్టేషన్‌ను మెరుగుపరిచి శాశ్వత ప్రాతిపదికన పోలీసులను నియమించే అవకాశాలు ఉన్నాయి.


అవినాష్‌ను అభినందిస్తున్న వైసీపీ నాయకులు

ఓవరాక్షన్ చేస్తే పరిగెత్తిస్తాం

● మాజీ మంత్రి పేర్నినాని

పటమట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓవర్‌యాక్షన్ చేసేవాళ్లను ఎవరనీ వదిలిపెట్టేది లేదని, వారిని పరిగెత్తించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వైసీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్నినాని కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా దేవినేని అవినాష్ ప్రమాణ స్వీకారం బందరురోడ్డులో ఓ కల్యాణమండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రజలను మోసం చేశారని, వాళ్లు అధికారంలోకి వచ్చాక వైసీపీ శ్రేణులను ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టారని, అధికార మదంతో వైసీపీని అణగదొక్కాలని చూస్తున్నారని, సోషల్ మీడియాలో వైసీపీకి అనుకూలంగా పోస్టు పెడుతుంటే వారిని టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నా లేకపోయినా శత్రువులతో పోరాడే వైసీపీ కార్యకర్తలున్నారన్నారు. జనసేన కార్యకర్తల పరిస్థితి పగోడికి కూడా రాకూడదన్నారు. మూడు పార్టీలు కాదు 30 పార్టీలు కలిసి వచ్చినా ఏమీ అవ్వదని, అవినాష్ నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి ముందుంటామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన దేవినేని అవినాష్ మాట్లాడుతూ దేశంలో ఏ సీఎం చేయని విధంగా జగన్ పథకాలు అమలు చేశారన్నారు. టీడీపీ సోషల్ మీడియా అనుకూల మీడియా ప్రజలను తప్పుదారి పట్టించారన్నారు. 6 నెలల కూటమి పాలనలో డొల్లతనం బయటపడిందన్నారు. 2029లో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు. వైసీపీ శ్రేణులెవరూ అధైర్యపడవద్దని, కార్యకర్తల జోలికొస్తే లీగల్‌గా ఎదుర్కొందామన్నారు. రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, స్వామి దాస్, తన్నీరు నాగేశ్వరరావు, సర్నాల తిరుపతిరావు, కడియాల బుచ్చిబాబు, డిప్యూటీ మేయర్లు, వైసీపీ కార్పొరేటర్లు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గంజాయితో నలుగురి అరెస్టు

చిట్టినగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిట్టినగర్ సాయిరాం థియేటర్ వెనుక నిర్మాణంలో ఉన్న భవనంలో గంజాయి సేవిస్తున్న నలుగురిని కొత్తపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సాయిరాం సెంటర్‌కు చెందిన మంగళగిరి అజయ్ దుర్గాప్రసాద్, గన్నవరం కాసరపల్లి అంబేద్కనగర్‌కు చెందిన చేబ్రోలు ధనకోటేశ్వరరావు, కేసరపల్లి హరిజనవాడకు చెందిన జుజ్జవరపు రత్నభాస్కర్, కండ్రికకు చెందిన బొరిశెట్టి సింహాచలం కొత్తగా నిర్మాణమవుతున్న భవనంలో గంజాయిని తాగుతున్నారు. పక్కా సమాచారంతో కొత్తపేట పోలీసులు అక్కడికి వెళ్లి నలుగురిని అదుపులోకి తీసుకుని 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

మతసామరస్యాన్ని కాపాడే నేత సీఎం చంద్రబాబు

● ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మతసామరస్యాన్ని కాపాడే నేతని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఆదివారం విద్యాధరపురం, కుమ్మరిపాలెం సెంటర్ సమీపంలోని ఈద్గా మైదానంలో ఆంధ్రప్రదేశ్ జమా అతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో వక్ఫ్ పరిరక్షణ మహాసభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న చిన్ని మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు కూలంకషంగా అన్ని ముస్లిం సంఘాల నేతలతో మాట్లాడి తగిన నిర్ణయం తీసుకుంటారన్నారు. తెలుగుదేశం పార్టీ ఏరోజూ ముస్లిం సమాజ అభిష్టానికి వ్యతిరేకంగా పనిచేయదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లిం సమాజాభివృద్ధికి, వక్ఫ్ ఆస్తులు కాపాడేందుకు నిరంతరం


మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

ఆలోచిస్తున్నారన్నారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ముస్లిం సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్న వక్ఫ్ సవరణ బిల్లును వైసీపీ వ్యతిరేకిస్తుందన్నారు. వైఎస్ జగన్ ఎల్లవేళలా ముస్లింలకు అండగా నిలుస్తారన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 75 ప్రకారం ఏ మంత్రి విబేధించినా తన మంత్రి పదవికి రాజీనామా చేసి బయటకు రావాల్సి ఉంటుందన్నారు. వక్ఫ్ సవరణలో 8 అంశాలను వైసీపీ వ్యతిరేకిస్తోందన్నారు. టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎండీ షరీఫ్, జమా అతే ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ సాదాతుల్లా హుస్సేనీ, జమా అతే ఇస్లామీ హింద్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు అబ్దుల్ రఫీ, ఇంకా పలువురు వక్తలు మాట్లాడారు. టీడీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి ఎండీ ఫతావుల్లా, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంఎస్ బేగ్, నిర్వాహకులు, ముస్లిం ప్రధాన సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

34.5 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం


లారీని స్వాధీనం చేసుకున్న అధికారులు

విస్సన్నపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు నూజివీడు రోడ్డుపై ఒక వే బ్రిడ్జ్ సమీపంలో లారీలో తరలిస్తున్న 34.5 టన్నుల రేషన్ బియ్యాన్ని ఆదివారం పీడీఎస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరుకు చెందిన మాదారాజు కృష్ణ శివదీప్ అనే వ్యక్తి మచీలిపట్నం ఉండ్రాజవరం నుంచి తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు లారీలో బియ్యాన్ని తరలిస్తుండగా మార్గ మధ్యలో విస్సన్నపేటలో పట్టుకొని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పీడీఎస్ డీటీ బి.శివనాగరాజు తెలిపారు. 6ఏ కింద కేసు నమోదు చేసి బియ్యాన్ని తిరువూరు మణికంఠ హనుమాన్ రైస్ మిల్లులో భద్రపరిచినట్టు తెలిపారు. నిందితుడిని ప్రశ్నించగా మచిలీపట్నం జరిగిన రేషన్ బియ్యం వేలంలో బియ్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తున్నట్టు తెలిపాడని డీటీ తెలిపారు. వీఆర్వో పాండు, వీఆర్ఏ రాంబాబులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో నేడు జాబ్‌మేళా

కృష్ణలంక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ - సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు 5న మంగళవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్రీనివాసరావు ఆదివారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ముత్తూట్ ఫిన్‌కార్ప్, ఎస్‌బీఐ పేమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ముక్కు ఫైనాన్షియల్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని, ఎంపికైతే నెలకు సుమారు రూ.12 నుంచి రూ.35వేల వరకు ఇతర సౌకర్యాలతో కూడిన వేతనం ఇస్తారన్నారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్టు వారు తెలిపారు. ఆసక్తి, అర్హతలు కలిగిన అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://టిన్యూర్ల్.కామ్/జామ్‌మేళా-వీజేడీస్ట్ లింక్ నందు తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి రెజ్యూమ్ లేదా బయోడేటాతో పాటు ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు రావాలని, వివరాలకు 9347779032 నంబరులో సంప్రదించాలన్నారు.

తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నేతల ఘనస్వాగతం

వన్‌టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడితో కలిసి విజయవాడకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నేతలు కొలనుకొండ శివాజీ గన్నవరం విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివాజీ వారికి పార్టీ కండువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. శివాజీతో పాటు గిడుగు రుద్రరాజు, అల్లం రాజేశ్, నేతలు ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.555

ఎమ్మెల్యే వెనిగండ్ల చిత్రపటానికి క్షీరాభిషేకం



గుడివాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ధనియాలపేటలోని రహదారులు, డ్రెయినేజీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ధనియాలపేటలో వెనిగండ్ల చిత్రపటానికి వారు క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, నాయకులు మజ్జాడ నాగరాజు, రామధేను వేణుబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయం!

- 1977లో ప్రారంభించిన మోటూరు గ్రంథాలయం
- 1989లో నిర్మించిన నూతన భవనం
- వందలాది పుస్తకాలు అందుబాటులో
- భవనం పడిపోతుందన్న భయంతో చదువుకోవడానికి రాని పాఠకులు
- నూతన భవనం నిర్మించాలంటున్న గ్రామస్థులు



కూలటానికి సిద్ధంగా ఉన్న మోటూరులోని గ్రంథాలయ భవనం

(ఆంధ్రజ్యోతి-గుడివాడ రూరల్)

మండలంలోని మోటూరు గ్రామంలో గ్రంథాలయాన్ని 1977లో ప్రారంభించారు. 1989లో మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి ఆధ్వర్యంలో నూతన భవన ప్రారంభోత్సవం జరిగింది. ఇప్పుడు గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. గ్రంథాలయ భవనం కూలటానికి సిద్ధంగా ఉండటంతో వందలాది పుస్తకాలు ఉన్నప్పటికీ పాఠకులు చదువుకోవడానికి పెద్దగా రావడం లేదు. ఉద్యోగులు, వచ్చిన కొద్ది మంది పాఠకులు భవనంలో ఉండాలంటే భయపడుతున్నారు. గ్రంథాలయం ఉపయోగించుకున్న మోటూరు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన చాలా మంది ఉద్యోగాల్లో, ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అధికారులు స్పందించి నూతన భవనం నిర్మించాలని మోటూరు గ్రామస్థులు కోరుతున్నారు.

నూతన భవనం నిర్మించాలి



ఈ గ్రంథాలయంలో చదివి మా గ్రామస్థులు ఉన్నత స్థాయికి చేరారు. నేడు గ్రంథాలయానికి యువకులు రావాడానికి భయపడుతున్నారు. అధికారులు నూతన భవనం నిర్మించాలి.

- సాంబయ్య, మోటూరు వాసి

నిధులు మంజూరు చేయాలి



గ్రంథాలయం భవనం శిథిలావస్థకు చేరడాన్ని చూస్తుంటే బాధగా ఉంది. ఉన్నతాదికారులకు తెలియజేశాను. కానీ ఎవరూ పట్టించుకోలేదు. అధికారులు స్పందించి గ్రంథాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

- సురేష్, మోటూరు వాసి



ఆలపాటిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు

ఆలపాటికి రావి పరామర్శ

గుడివాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను ఆదివారం గుంటూరులోని ఆయన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల మాజీ మంత్రి ఆలపాటి మాతృమూర్తి ఆలపాటి వనజాక్షి మృతి చెందారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

పీఆర్ డిప్లొమా ఇంజనీర్స్ జిల్లా కార్యవర్గం

గుడివాడ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ ఉద్యోగుల సొసైటీలో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో పంచాయతీ రాజ్ డిప్లొమా ఇంజనీర్స్ సంఘం 2025-27 జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కన్నెబోయిన శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ వల్లభనేని సూరిబాబు, ఉపాధ్యక్షులుగా బి.రవి, కోశాధికారిగా బి.వాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి గోపాలరావును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా నగేష్‌కుమార్, ఎన్నికల పరిశీలకులుగా వెంకటరెడ్డి వ్యవహరించగా, అతిథులుగా జి.సోమేశ్వరరావు, అట్లూరి వెంకటేశ్వరరావు, రామరాజు, కె.నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.



బంటుమిల్లి లక్ష్మీపురం సెంటర్‌లో రైతుల ధర్నా

దాళ్వాకు అనుమతివ్వాలి

బంటుమిల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి ప్రధాన కాలవ పరిధిలో దాళ్వా వరి సాగుకు అనుమతివ్వాలంటూ బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల రైతులు ఆదివారం లక్ష్మీపురం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. నాలుగేళ్లుగా ఈ ప్రాంతంలో దాళ్వా లేకపోవడంతో ఉప్పు శాతం పెరిగి వరి పొలాలు దెబ్బతిని దిగుబడి తగ్గుతోందని, రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని రైతు సంఘం నాయకులు తెలిపారు. సముద్ర తీర ప్రాంతంకావడంతో పంట విరామం ఇస్తే ఉప్పుశాతం పెరిగి నష్టం భరించాల్సి వస్తోందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని దాళ్వా సాగుకు అనుమతులు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల అధ్యక్షులు మలిశెట్టి శివరామ్‌ప్రసాద్, అజయ్‌ఘోష్, గౌరిశెట్టి నాగేశ్వరరావు, వెంట్రపాటి సురేష్, పుప్పాల సూర్యనారాయణ, జొన్నల వీరెంద్ర, యర్రా రమేష్, పుప్పాల నరసింహారావు, మాజేటి శివశ్రీని వారావు, కిరణ్, కన్నారావు, కుటుంబరావు, సురేష్, కృష్ణారావు, గౌరిశెట్టి వెంకన్న, నుంకా వెంకన్న, బండ్రెడ్డి ఆంజనేయులు, బంటు మిల్లి, కృత్తివెన్ను మండలాల రైతులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈఈ సత్యపాండురంగ

అభివృద్ధి పనుల పరిశీలన

ఉయ్యూరు, నవంబరు 3 : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులను మున్సిపల్ శాఖ డీఈఈ ఆవుల సత్య పాండురంగ ఆదివారం పరిశీలించారు. ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల రోడ్డు 14వ వార్డులో రూ. 97.13 లక్షల అంచనాతో 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ నిధులతో నిర్మిస్తున్న 250 కేఎల్ ఈఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంకు పనులను వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎల్. పోతురాజుతో కలసి పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. రాజర్షినగర్‌లో సీసీ డ్రెయిన్, దుర్గా ఎస్టేట్‌లో వాకింగ్ ట్రాక్ ఫెన్సింగ్ పనులను పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

బహిరంగంగానే బెల్టు షాపు

- పట్టపగలే అమ్మకాలు
- సీఎం చంద్రబాబు ఆదేశాలు బేఖాతరు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

గుడివాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహించినా, వారికి మద్యం సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ఆయన ఆదేశాలు బేఖాతరు చేస్తూ గుడివాడలో దానికి భిన్నంగా నడుస్తోంది. బెల్టు దుకాణం నడుస్తున్నట్లు తెలిసినా ఎక్సైజ్ అధికారులు కిమ్మనకుండా ఉన్నారు. ఇటీవల మద్యం దుకాణాల వేలంలో దుకాణాన్ని దక్కించుకున్న వ్యక్తి తొలుత బంటుమిల్లి రోడ్డులోని ఎర్రబడ్డీ సెంటర్‌లో



బహిరంగంగానే అమ్మకాలు

బెల్టుషాపు కాదు.. వైన్ షాపును ఇక్కడకు తరలిస్తున్నారు

ఇది బెల్టు షాపు కాదు. ఏలూరురోడ్డులోని మద్యం దుకాణాన్ని బంటుమిల్లి రోడ్డులోని వివాదాస్పద దుకాణంలోకి మారుస్తున్నారు. అక్కడి నుంచి కావాలసిన వస్తుసామగ్రిని తరలిస్తున్నారు. రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో దుకాణాన్ని ఇక్కడికి మారుస్తారు. 7వ తేదీలోపు పూర్తిస్థాయిలో దుకాణాల ఏర్పాటుకు సమయముంది.

- రమణ, ఎక్సైజ్ సీఐ

దుకాణాన్ని పెట్టారు. స్థానిక వ్యాపారులు, స్థానికుల ఆందోళనతో రెండు రోజుల అనంతరం ఆ దుకాణాన్ని వేరే చోటకు మార్చారు. తీసేసిన దుకాణం స్థానంలో ఎవరు పెట్టారో, ఎప్పుడు పెట్టారో, ఎవరి ప్రోద్బలంతో ఏర్పాటు చేశారో బెల్టు షాపు వెలిసింది. మద్యం దుకాణం మాదిరిగానే విక్రయాలు చేపట్టారు. ఆదివారం మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. ఏకంగా డిజిటల్ స్కానర్‌ను ఏర్పాటు చేశారు. బహిరంగంగా మద్యం విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. దీనిపై ఎక్సైజ్ అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. ఈ షాపునకు మద్యాన్ని ఎవరు సరఫరా చేశారో తెలియాల్సి ఉంది.

అనుమతులు, బోర్డు లేకుండా అమ్మకాలా?

ప్రస్తుతం ఏలూరురోడ్డులోని దుకాణంలో అమ్మకాలు



అనధికార బెల్టు షాపు

సాగుతున్నాయి. ఆదివారం కూడా అమ్మకాలు సాగాయి. సీఐ చెప్పినట్టు ఆ దుకాణాన్ని బంటుమిల్లి రోడ్డుకు మార్చాలనుకుంటే అక్కడా, ఇక్కడా విక్రయాలు జరపకూడదు. ఆదివారం ఏలూరు రోడ్డు దుకాణంలో అమ్మకాలు ఎలా చేపట్టారో ఎక్సైజ్ అధికారులకే తెలియాలి. అనుమతులు లేకుండా, బోర్డు లేకుండా అమ్మకాలు చేపడితే బెల్టు షాపుగానే పరిగణలోకి తీసుకోవాలి. దీనిపై ఎక్సైజ్ అధికారులు ఎటువంటి చర్యలు చేపడతారో చూడాలి.




అసంపూర్తిగా గ్రామపంచాయతీ భవనం

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

చినముత్తేవి పంచాయతీ భవనం

(ఆంధ్రజ్యోతి-కూచిపూడి)

మండల పరిధిలోని చినముత్తేవి గ్రామంలో అసంపూర్తిగా మిగిలిన గ్రామ పంచాయతీ భవనం నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. 2014వ సంవత్సరం చివరిలో గ్రామపంచాయతీ భవనంగా దీనిని నిర్మాణం చేపట్టారు. శ్లాబ్ దశ పూర్తి అయినప్పటికీ పూర్తిస్థాయిలో భవనం రూపొందలేదు. తదుపరి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి నిధులు విడుదల చేయకపోవటంతో ఈ భవనం అసంపూర్తిగా మిగిలి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఈ భవనం సమీపంలో బస్టాప్ ఉండటంతోపాటు ప్రధాన సెంటర్ కావటంతో మహిళలు ఆ ప్రాంతంలో రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. భవనం పూర్తిస్థాయిలో రూపొందించేందుకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం కిటకిట

మోపిదేవి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి ఆది వారం కావడంతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులతో కిటకిటలాడింది. భక్తులు నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలుచే శారు. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆరు గజాల గండికి

రూ.5 లక్షల అంచనానా?

- ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేరు వాడడం సరికాదు
- ఇరిగేషన్‌శాఖ అధికారుల తీరుపై ఆక్వా రైతుల ఆగ్రహం

నందివాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిన్న చిన్న గండ్లు పూడ్చడానికీ ఇరిగేషన్ అధికారులు రూ.లక్షల్లో అంచనాలు వేయటం, దానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేరు వాడుకోవడం సరికాదని గొంగళ్లమూడి, అనమనపూడి ఆక్వా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గొంగళ్లమూడి ఎన్టీఆర్ విగ్రహం వద్ద విలేకరులతో ఆక్వా రైతులు సుధాకర్, కోగంటి చిన్నబాబు తదితరులు మాట్లాడారు. మండలంలోని తమిరిశ శివారు అంకనగూడెం వంతెన వద్ద తుఫాను కారణంగా దోసపాడు కాలువ, చంద్రయ్య కాలువ మధ్య గట్టు చినపాటి గండి పడిందని, ఆ గండిని ఆక్వా రైతులం పూడ్చుతామని డీఈఈ భరత్‌కు తెలిపామన్నారు. డీఈ భరత్ ఇప్పుడు లేదులే తర్వాత చూద్దాం అంటూ సమాధానం ఇచ్చారన్నారు. అంకనగూడెం వద్ద ఆరు గజాల గండిని రెండు రోజులుగా ఒక కాంట్రాక్టర్‌తో పూడ్చిస్తున్నారని తెలిపారు. దీనిపై విచారించగా, ఇరిగేషన్ అధికారులు ఈ గండికి రూ.5 లక్షల అంచనా పంపారని తెలిపారు. దోసపాడు వద్ద గండికి మరో రూ.5లక్షలు రెండు గండ్లకు కలిపి రూ.10 లక్షలు అంచనాలు వేసినట్లు తెలిసిందన్నారు. డీఈ భరత్‌ను అడిగితే ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పూడ్చమన్నారని, కాంట్రాక్టర్‌తో పూడ్చిస్తున్నామని తెలిపారన్నారు. రైతులు రూ.50 వేలు ఖర్చు చేస్తే పూడిపోయే గండికి రూ.5 లక్షలు అంచనా ఏంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచితంగా పూడ్చుతామన్నా పట్టించుకోకుండా అధికా రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దోసపాడు కాలువ మండవల్లి మండలంలో ఇంగిలింపాకలంక వరకు వెళ్తుందని, పూర్తిగా గుర్రపుడెక్క, ముళ్ల కంపలతో పూడిపోయిందని, ఈ డబ్బులు దోసపాడు కాలువ చివరి వరకు బాగు చేయిస్తే శివారు గ్రామాలకు తాగునీరు అందుతుందని తెలిపారు. ఈ కాంట్రాక్టర్ కూడా చంద్రయ్య కాలువ అంచుల మట్టి తీసి గండ్లు పూడ్చటం దారుణమన్నారు. ఈ కాలువ గండ్లపై కలెక్టర్ డీకే బాలాజీ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. దోసపాడు కాలువ చివరి వరకు గుర్రపు డెక్క, ముళ్ల కంచెలు తొలగిస్తే రానున్న వేసవి కాలంలో చివరి గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. గొంగళ్లమూడి, అనమనపూడి రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆక్వా రైతులు



ఎమ్మార్పీఎస్ నాయకుల సంఘీభావం

వర్గీకరణ అమలయ్యే వరకు ఉద్యోగాల భర్తీ నిలిపేయాలి

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు

పమిడిముక్కల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు గ్రూప్-1, 2, 3, ఎస్సై, కానిస్టేబుల్, ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్, ఆర్టీసీ ఉద్యోగాల భర్తీని నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు కోరారు. పామర్రు నియోజకవర్గ ఎంఎస్సీ, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం పామర్రులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్నంగి నాగరాజు, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు రుద్రపోగు సురేశ్ పాల్గొన్నారు. మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. కృష్ణాజిల్లాలో ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల కమిటీ నిర్మాణంపై సమీక్షించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు కొల్లూరి బసవ, జాతీయ నాయకులు మంద వెంకటేశ్వరరావు, కోట దానియేలు, సిద్దిల జయరాజ్, మంద పిచ్చియ్య, నాగమల్లేశ్వరరావు, నాగబాబు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

120 మందికి వైద్య పరీక్షలు

గుడివాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో డాక్టర్ లక్ష్మీపెరుమాళ్ళు, ప్రభావతి, సి.సి రాయన్‌ల జ్ఞాపకార్థం ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపులో 120మందికి వైద్య సేవలందించారు. మోకాళ్ల నొప్పులు, ఎముకల సంబంధిత, జనరల్ పరీక్షలు, బీపీ, షుగర్, ఊపిరితిత్తులు, ఆయాసం సమస్యలకు వైద్యసేవలందించారు. ప్రోగ్రామ్ కన్వీనర్లు డాక్టర్ సి.సూర్యచంద్రరావు, గుళ్లపల్లి కిరణ్‌బాబులు, రోటరీ క్లబ్ అధ్యక్షులు టి.ఎస్ రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి జి.నరేష్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ వై.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, ప్రేమచంద్, ఎ.వి.రంగారావు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి వెండి నాగపడగ బహూకరణ

మోపిదేవి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి సూర్యారావుపేటకు చెందిన మాకినేని వెంకట విజయకుమార్ 950 గాముల బరువైన వెండి నాగ పడగను ఆదివారం బహూకరించారు. ఆలయ ఈవో డి.శ్రీరామవర ప్రసాదరావుకు నాగపడగను అందజేశారు.

వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివా రం భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు పెట్టారు. కార్యక్రమంలో బెల్ కంపెనీ విజిలెన్స్ అధికారి కె.శ్రీధర్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లంకిశెట్టి హరనాథబాబు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ల శిబిరం

మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికెట్ల శిబిరం నిర్వహించారు. రిటైర్డు ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్లకు దరఖాస్తులు అందించారు. దరఖాస్తులను సంఘ అధ్యక్షుడు పి.వి. ఈశ్వరరావు, కార్యదర్శి బి.కోటేశ్వరరావు పూర్తి చేసి గుంటూరు కార్యాలయానికి తీసుకెళుతున్నారు.



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం కిటకిట

మోపిదేవి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి ఆదివారం కావడంతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులతో కిటకిటలాడింది. భక్తులు నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఒక్కరోజు ఆదాయం రూ.10.55 లక్షలు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయానికి ఆదివారం ఒక్కరోజు రూ.10,55,813 ఆదాయం వచ్చిందని ఈవో శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలకు సేవా రుసుముల ద్వారా ఆదాయం సమకూరిందని ఆయన పేర్కొన్నారు. స్వామి నిత్య శాంతి కల్యాణంలో 76 మంది దంపతులు, 222 మంది మహాన్యాస పూర్వక రుద్రాభిషేకంలో పాల్గొన్నారని, 2113 మంది శీఘ్రదర్శనం చేసుకున్నారని ఆయన తెలిపారు.

సుబ్బారాయుడికి వెండి నాగపడగ బహూకరణ

మోపిదేవి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి సూర్యారావుపేటకు చెందిన మాకినేని వెంకట విజయకుమార్ 950 గ్రాముల బరువైన వెండి నాగ పడగను ఆదివారం బహూకరించారు. ఆలయ ఈవో డి.శ్రీరామవర ప్రసాదరావుకు నాగపడగను అందజేశారు.



ఈవో శ్రీరామవరప్రసాదరావుకు వెండి నాగపడగను అందిస్తున్న దాతలు



వెండి మండపం అందజేస్తున్న దాతలు

కన్యకా పరమేశ్వరి ఆలయానికి
వెండి మండపం వితరణ

నాగాయలంక, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భృగుమళ్ల రాఘవేంద్ర వెంకట సత్యనారాయణగుప్తా జ్ఞాపకార్థం గ్రామానికి చెందిన భృగుమళ్ల నాగ మల్లేశ్వరరావు, వెంకటలక్ష్మి కనకదుర్గ దంపతులు 3 కిలోల వెండితో తయారు చేసిన రూ.3 లక్షల విలువైన మండపాన్ని ఆదివారం వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయానికి వితరణగా ఇచ్చారు. దాతలు ఊరేగింపుగా మండపాన్ని తీసుకొచ్చి ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావుకు అందజేశారు.



కావడి యాత్రకు స్వాగతం పలుకుతున్న మండలి వెంకట్రామ్

వైభవంగా కావడి యాత్ర

అవనిగడ్డ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేకనూరులోని ఉభయ ముక్తీశ్వరస్వామి ఆలయం నుంచి గురుస్వామి పుట్టి శ్రీను ఆధ్వర్యంలో కావడియాత్రను నిర్వహించారు. వేకనూరు శివాలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్రకు గ్రామస్థులు అడుగడుగునా స్వాగతం పలికారు. అవనిగడ్డ నుంచి నడుచుకుంటూ మోపిదేవి తరలివెళ్లారు. వారికి గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్‌కుమార్ స్వాగతం పలికారు.

పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆకుమర్రు గ్రామంలోని హెల్త్ సెంటర్ వద్ద ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోను చించివేసి నందుకు నిరసనగా ఆదివారం కూటమి నాయకులు పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోతన స్వామి, జనసేన మండల అధ్యక్షుడు దాసరి ఉమా సాయిరామ్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోపీ నాగబాబు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఎస్ఏ బేగ్, నాయకులు పోతుల రాము, బొల్లా మోహనరావు, కనపర్తి ఆశీర్వాదం, సుంకుల శ్రీరామకృష్ణ, కమ్మగంటి రవి, శివనాగరాజు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆకుమర్రులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మల్లవోలు యానాదుల కాలనీకి చెందిన పొట్లూరి పోలయ్య ఆదివారం మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలకు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ రూ.5వేలు పోలయ్య కుటుంబ సభ్యులకు అందించింది. కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన త్రినాథ్, నెహ్రూ, కోలా వాసు పాల్గొన్నారు.



ఆటోలకు అడ్డాగా..

బస్టాండ్ వద్ద ఆటోలు, ఫ్లెక్సీలు

బంటుమిల్లి బస్టాండ్

బస్టాండ్‌ను కమ్మేసేలా ఫ్లెక్సీలు ● ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి-బంటుమిల్లి): చుట్టుపక్కల గ్రామాలకు కూడలి, మండల కేంద్రం బంటుమిల్లి. 216 జాతీయ రహదారి వేశాక గోదావరి జిల్లాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు, ప్రయాణికుల రద్దీ పెరిగింది. కానీ, బంటుమిల్లి బస్టాండ్ ఎదురుగా ఆటోలు, ద్విచక్రవాహనాలు పెట్టడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇది బస్టాండా..ఆటో స్టాండా? అర్థం కావడంలేదని అధికారులు, ఆటోలు, బైకుల పెట్టేవారి పట్ల చూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు అంటున్నారు. దీనికితోడు కొత్తగా వచ్చేవారికి బస్టాండ్ కనిపించనంతగా కమ్మేసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.



బస్టాండ్ ఎదుట నిలిపి ఉంచిన బైక్‌లు

అన్నీ సమస్యలే..

బంటుమిల్లిలో ప్రతి బుధవారం సంత జరుగుతుంది. సంతకు సుదూర ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు వస్తారు. మంగళవారం రాత్రి బస్టాండుకు చేరుకుని రాత్రి అక్కడే ఉండి, ఉదయాన్నే సంతకు వెళతారు. రాత్రివేళల్లో బస్టాండ్‌లో లైట్లు వెలగడం లేదని, ఫ్యాన్లు తిరగవని, దోమలు ఎక్కువగా ఉంటున్నాయని చెబుతున్నారు. యూరినల్‌కు వెళితే రూ.10 వసూలు చేస్తున్నారని కొందరు ప్రయాణికులు చెబుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



బంటుమిల్లి బస్టాండ్‌ను ఆధునీకరించాలి. విద్యార్థినులకు, మహిళలకు అసౌకర్యం కలగకుండా చూడాలి. తాగునీటి సౌకర్యం కల్పించాలి.

-మాజేటి శివశ్రీనివాసరావు, బంటుమిల్లి

ఆటోలు, బైక్‌లకు స్థలం కేటాయించాలి



బస్టాండ్ ఎదురుగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు పెడుతున్నారు. ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంటోంది. బస్టాండ్ వద్ద భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు పెట్టుకోవడానికి స్థలాలు కేటాయించాలి. సమస్యలు పరిష్కరించి, ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చూడాలి.

- ముత్యాల నాగేశ్వరరావు, బంటుమిల్లి

పై అధికారులకు విన్నవించాం

బస్టాండ్‌లో సమస్యలు మా దృష్టికి వచ్చాయి. సమస్యల పరిష్కారం కోసం మా పై అధికారులకు విన్నవించాం. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూస్తాం.

-పెద్దిరాజులు, ఆర్టీసీ డీఎం



దీనదయాళ్‌పురంలో సొంత ఖర్చుతో తాగునీటి సమస్యను పరిష్కరించి గ్రామస్థులకు నీటిని అందిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్

సేవాతత్పరుడు విక్కుర్తి శ్రీనివాస్

● నియోజకవర్గంలో ఏడాదిగా సేవా కార్యక్రమాలు

అవనిగడ్డ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఏడాది నుంచి విక్కుర్తి వీరరాఘవయ్య ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ట్రస్ట్ అధ్యక్షుడు విక్కుర్తి శ్రీనివాస్ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఏడేళ్లుగా పంట కాలువల ద్వారా పొలాల్లోకి నీరు ఎక్కక ఇబ్బందులు పడుతున్న సొర్లగొంది, దీనదయాళ్‌పురం, దిండి, పర్రచివర గ్రామాల రైతుల కష్టాలు తీర్చేందుకు నాగాయలంక మండలం పెదపాలెం నుంచి సొర్లగొంది వరకు దాదాపు ఆరు కిలోమీటర్ల మేర పంట కాలువను సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. దీంతో ఎగువ రైతులతో సమానంగా వారు ఈ ఏడాది నాట్లు పూర్తి చేసుకోగలిగారు. దీనదయాళ్‌పురంలో పైపులైన్లు దెబ్బతిని గ్రామంలో తాగునీరు అందకపోవడంతో పైపులైన్‌ను మరమ్మతులు చేయించారు. గ్రామానికి తాగునీటిని తీసుకెళ్లారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

మత్స్యకార బాక్సర్ కొల్లాటి అశోక్‌కు విక్కుర్తి ఆర్థిక సాయమందించి దక్షిణ అమెరికాకు పంపించారు. అశోక్ ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానం సాధించారు. క్రీడాకారులకు పుట్టినిల్లు లాంటి అవనిగడ్డ ప్రభుత్వ క్రీడా మైదానానికి గేట్లు లేకపోవటంతో భారీ వాహనాలు మైదానంలోకి చొరబడి ట్రాక్‌లు దెబ్బతింటున్నాయి. విక్కుర్తి వీరరాఘవయ్య ట్రస్ట్ ద్వారా గేట్లు ఏర్పాటు చేయించారు. నియోజకవర్గంలో ఏ గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగినా ట్రస్ట్ ద్వారా సాయమందిస్తున్నారు. ఇటీవల వరదల కారణంగా పశువులకు ఆహారం లేక ఇబ్బంది పడుతుంటే బయటి ప్రాంతాల నుంచి వరిగడ్డి, దాణా తెచ్చి రైతులకు పంపిణీ చేశారు. ముంపునకు గురైన పలు గ్రామాల్లో ఆహార ప్యాకెట్లు అందించారు. కోడూరు మండలం పిట్టల్లంక వద్ద డ్రెయినేజీ సమస్య కారణంగా పొలాలు మునిగిపోతుంటే కరకట్ట దిగువన డ్రెయినేజీ బాగు చేయించారు. పొలాలకు ముంపు తప్పింది.



మెహెర్ బాబాకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మెహెర్‌బాబా బోధనలు ఆచరణీయం

చల్లపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెహర్ బాబా బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం చల్లపల్లిలోని మెహెర్‌బాబా సెంటర్‌లో కార్తీక వనసమారాధన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి బాబాకు పూజలు చేశారు. బాబా సెంటర్ అధ్యక్షుడు చుండూరి మెహెర్‌ప్రసాద్, కార్యదర్శి పి.వి.రమణారావు, చుండూరి ప్రభాకర్, షేక్ నసీం ఘోరి, కేజే శ్రీనివాస్ చంద్, భక్తులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

నాగాయలంక, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద ఆదివారం ఉదయం పడవల నుంచి లోడ్ చేసుకుని అనధికారికంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘాట్‌కు ఆవల ఎదురుగా ఉన్న ఇసుక దిబ్బలను తవ్వి పడవల్లో తెచ్చి ఘాట్ ప్లాట్‌ఫామ్‌ల వద్ద ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్నారు. ఈ ఇసుకను గ్రామంలోని రోడ్ల నిర్మాణానికి వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక మాధ్యమాల్లో ఇసుక తోలకాలపై రావటంతో ఎస్ఐ కె.రాజేష్ సిబ్బందితో ఘాట్‌కి వచ్చారు. ఇసుక రవాణా నిలుపుదల చేశారు. ట్రాక్టర్ల యజమానులకు జరిమానాను విధించాలని తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారు. ఇసుక తరలింపు వెనుక అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ఉన్నట్లు సమాచారం.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కోడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వి.కొత్తపాలెంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా సర్వస్వం కోల్పోయిన గోవాడ లక్ష్మి కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుమారుడు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. రూ.5 వేలు నగదు, దుప్పట్లు, నూతన వస్త్రాలు అందజేశారు. స్థానిక నాయకుడు రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని వెంకట్రామ్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో బాసు నాంచారయ్యనాయుడు, యలవర్తి వెంకన్న, రేపల్లె పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

పర్రచివరలో..

నాగాయలంక: పర్రచివరలో ఇటీవల ఇల్లు కాలిపోయిన మెండు నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని అవనిగడ్డ సీఐ యువకుమార్ ఆదివారం పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. రూ.5 వేలు బాధిత కుటుంబానికి ఆయన అందజేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



సత్రంపాలెంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న గోపు సత్యనారాయణ

మచిలీపట్నం టౌన్ , నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బందరు మండలం తాళ్లపాలెం పంచాయతీ పరిధిలోని సత్రంపాలెంలో తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదును ఆదివారం నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో సభ్యత్వ నమోదు జోరుగా సాగింది.

లంకిశెట్టి సాయిఫణి సంతోష్‌కు అరుదైన గౌరవం

మచిలీపట్నం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని టెక్సాస్ ఏఅండ్ఎం యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ లా పూర్తి చేసుకున్న నగరానికి చెందిన లంకిశెట్టి సాయి ఫణి సంతోష్ రింగ్ ఈవెంట్ ఫంక్షన్‌లో పాల్గొని అరుదైన గౌరవాన్ని పొందారు. విశ్వవిద్యాలయం స్థాయిలో ప్రతిభ కనబరిచిన 30 మందికి మాత్రమే ఈ రింగ్ ఈవెంట్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి నుంచి రింగ్‌ను పొందారు. తండ్రి ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, తల్లి లంకిశెట్టి వనజ, మల్లంపల్లి రామాంజనేయులు, చలవాది సత్యప్రకాష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



టెక్సాస్ ఏ అండ్ఎం యూనివర్సిటీలో రింగ్ ఈవెంట్‌లో పాల్గొన్న లంకిశెట్టి సాయిఫణి సంతోష్



బంటుమిల్లి లక్ష్మీపురం సెంటర్‌లో రైతుల ధర్నా

దాళ్వాకు అనుమతివ్వాలి

బంటుమిల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి ప్రధాన కాలవ పరిధిలో దాళ్వా వరి సాగుకు అనుమతివ్వాలంటూ బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల రైతులు ఆదివారం లక్ష్మీపురం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. నాలుగేళ్లుగా ఈ ప్రాంతంలో దాళ్వా లేకపోవడంతో ఉప్పు శాతం పెరిగి వరి పొలాలు దెబ్బతిని దిగుబడి తగ్గుతోందని, రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని రైతు సంఘం నాయకులు తెలిపారు. సముద్ర తీర ప్రాంతంకావడంతో పంట విరామం ఇస్తే ఉప్పుశాతం పెరిగి నష్టం భరించాల్సి వస్తోందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని దాళ్వా సాగుకు అనుమతులు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల అధ్యక్షులు మలిశెట్టి శివరామ్‌ప్రసాద్, అజయ్‌ఘోష్, గౌరిశెట్టి నాగేశ్వరరావు, వెంట్రపాటి సురేష్, పుప్పాల సూర్యనారాయణ, జొన్నల వీరేంద్ర, యర్రా రమేష్, పుప్పాల నరసింహారావు, మాజేటి శివశ్రీనివారావు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల రైతులు పాల్గొన్నారు.

విద్యావంతుడు ఆలపాటి

● ఎమ్మెల్సీగా గెలిపించండి

● పట్టభద్రులకు రావి సూర్యకిషోర్ తేజ పిలుపు

అవనిగడ్డ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 'పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ తరఫున విద్యావంతుడైన ఆలపాటి రాజేంద్రప్రసాద్ బరిలో నిలబడుతున్నారు. రౌడీ చరిత్ర ఉన్న వ్యక్తిని వైసీపీ బరిలోకి దింపుతోంది. ఆలపాటిని ఈ ప్రాంత ప్రతినిధిగా పెద్దల సభకు పంపేందుకు సహకరించండి.' అని పట్టభద్రులను ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు పరిశీలకుడు రావి సూర్య కిషోర్ తేజ కోరారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో టీడీపీ ఏర్పాటు చేసిన ఓటర్ల నమోదు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే వెంకట కనకదుర్గ, కూనపరెడ్డి చంద్రశేఖర్, బచ్చు కృష్ణకుమారి, పూషడపు రత్నగోపాల్, తుంగల రంగా పాల్గొన్నారు.

మన కోసం మనం ట్రస్ట్‌కు విరాళం

చల్లపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనకు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేస్తున్న మన కోసం మనం ట్రస్ట్‌కు కిసాన్ ఇంజనీరింగ్ వర్క్స్ నిర్వాహకుడు మహమ్మద్ ఇలియాస్ రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌కు చెక్కు అందించారు.



రూ.25 వేల విరాళాన్ని డాక్టర్ డీఆర్కేకు అందిస్తున్న ఇలియాస్